రాగాల రారాణి

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూలై 19, 2015

కళంకిత కమలం

కాజోల్ ! అభినయానికి మారు పేరు. వర్ధమాన కథానాయికలు సైతం ఇష్టపడే నటి. నిజానికి సినీ రంగం తనకేమీ కొత్తకాదు. తల్లి తనూజ నటి. తండ్రి షోము ముఖర్జీ దర్శక నిర్మాత. తొలి చిత్రం 'బేఖుడి' విఫలమైనా తదుపరి చిత్రం 'బాజీగర్' మాంచి విజయం సాధించింది. 'దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే, కుచ్ కుచ్ హోతా హై, కభీ ఖుష్ కభీ ఘమ్, ఫనా'...వంటి చిత్రాలను తన ఖాతాలో వేసేసుకుంది. అజయ్ దేవగన్ వివాహం, ఇద్దరు పిల్లలతో హ్యాపీగా వున్న కాజోల్ ఈ మధ్య సన్నబడి మెరుపుతీగలా తయారైంది. తనెంతగానో ప్రేమించే భర్త అజయ్, ముత్యాల్లాంటి పిల్లలు నైసా..యుగ్, సినిమాల గురించి ఆమె మాటల్లోనే....

ఇంట్లో నేనే బాస్

- నాకు పుస్తకాలంటే చాలా ఇష్టం. ఈ మధ్య కాలంలో కిండిల్‌తో చెప్పలేనంత సంతోషంగా వున్నాను. నిజానికి నాకు రెండేళ్ల వయసు నుంచే చదవడం మొదలెట్టాను. మా ఇంటి నిండా ఎక్కడ చూసినా... దాదాపు ప్రతి గదిలోనూ... పుస్తకాలే కనిపిస్తాయనుకోండి. ఈ విషయంలోనే అజయ్ కోప్పడుతుంటాడు. కొన్నిటిని తీసేశాడు కూడా. మా అమ్మాయి నైసా మంచి చదువరి. ప్రసిద్ధ పుస్తకాలు చదవమని స్కూల్లో చెప్తుంటారు. అన్నా సెవెల్ 'బ్లాక్ బ్యూటీ', జేన్ ఆస్టెన్ 'ప్రైడ్ అండ్ ప్రెజ్యుడిస్'...లాంటివి చాలా చదివేసింది తను. మేమిద్దరం పుస్తకాలు కొనడంలో పోటీ పడుతుంటాం. తనకు కొత్త పుస్తకాలు తెప్పించి ఇచ్చానంటే చాలు. కొద్ది గంటల పాటు ఆమె గురించి మర్చిపోవచ్చు. పుస్తకాల్లో లీనమైపోతుందిగా మరి. నేను పుస్తకాలు చదవకపోయి వుంటే నటిని అయ్యేదాన్ని కాదేమో!
- మా అబ్బాయి యుగ్ చాలా చిన్నవాడు. వాళ్ల నాన్నతో కలిసి అన్ని రకాల యాక్షన్ సినిమాలు చూస్తుంటాడు. చోటా భీమ్ వీరాభిమాని. ఒక్క మాటలో చెప్పాలంటే ఎవరో ఒకరు ఎవరో ఒకరిని కొడుతుండాలి. అలాంటి సినిమాలు వాడికి నచ్చుతాయి. నైసాకు టీనేజీ మ్యూజికల్ సినిమాలంటే ఇష్టం. అర్ధంపర్ధం లేని వాంపైర్ సినిమాలూ చూసేస్తుంటుంది. టీవీ కార్యక్రమాలనూ విడిచిపెట్టదు.
- యుగ్‌కు వాళ్ల నాన్న నటించిన సిన్మాలంటే చెప్పలేనంత ఇష్టం. రెప్ప వేయకుండా చూస్తాడు. వినోదం, మసాలా మిళితమైన చిత్రాలంటే నాకు ఇష్టం. ఎంత ఎమోషనల్ సినిమా అయినా వినోదం వుండాల్సిందే. లేకపోతే అంత సేపు కూర్చొని చూడలేను.
- ఇంట్లో నేనే బాస్‌ని. అజయ్‌లో నచ్చే విషయం ఏమంటే...నన్ను స్వేచ్ఛగా మాట్లాడనిస్తాడు. పదిహేను ఇరవై యేళ్లగా తను నాకు తెలుసు. ఈ కాలంలో ఎంతగానో ఎదిగాడు. మారాడు. తను ఎక్కువగా చెప్పడు. చెప్పింది చేస్తాడు. అజయ్ అంటే ఇష్టమే కాదు. గౌరవం కూడా. తనను బాబాజీ అని పిలుస్తాం. సలహాల కోసం అందరూ వస్తుంటారు.
- అజయ్‌లో నచ్చనివి చాలానే వున్నాయి. తను ఎక్కువగా మాట్లాడకపోవడం ఒక్కోసారి నచ్చుతుంది. ఒక్కోసారి నచ్చదు.
- నేను పిల్లల విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా వుంటాను. చెయ్యకూడనివి, చెయ్యాల్సినవి రెండూ చెప్తుంటాను. చెయ్యకూడనివి చాలానే వుంటాయి. చెయ్యాల్సినవి మాత్రం ఒక్కటే వుంటుంది. అది అమ్మ ఏది చెప్తే అది చెయ్యడం.
- నేను బరువు తగ్గాక మా అమ్మాయి చాలా మెచ్చుకుంటోంది. ఇదివరలో 'అమ్మా నువ్వు లావుగా కనిపిన్నావు. నీ డ్రెస్ బాలేదు....' అంటుండేది. దాని మాటలు పట్టించుకుంటే అస్సలు ప్రశాంతంగా వుండలేం. అందుకే అలా మాట్లాడొద్దని కేకలేసేదాన్ని.
- అందరు ఆడవాళ్లకు వుండే అభద్రతా భావాలే నాకూ వుంటాయి. నేను మరీ లావుగా వున్నానా? మరీ సన్నగా వున్నానా? అందంగా వున్నానా? అందంగా లేనా? 'నో' అని సున్నితంగా ఎలా చెప్పడం? వంటివి చాలానే వున్నాయి. వాటిని అభద్రతలు అనలేను కానీ అనుమానాలు అనొచ్చు. కొన్ని సార్లు ఈ సందేహాల్లోంచే నిర్ణయాలు తీసుకుంటుంటాం.
- 95 శాతం మనుషులు నాకు నచ్చరు. అందుకే నా ప్రపంచం చిన్నగా వుంటుంది. కానీ ఇటీవల చాలా వరకు వడపోసేస్తున్నాను. జనాన్ని భిన్నంగా ఎలా చూడాలో నా పిల్లలే నేర్పించారు. నాకు నచ్చని వాళ్లను కూడా పిల్లల కోసం భరిస్తుంటాను. చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటుంటాను.
- నైసాకు పన్నెండేళ్లు. ఇంకా చిన్నదే కాబట్టి... కొద్ది సంవత్సరాల తర్వాత తనేం కావాలో నిర్ణయించుకుంటుంది. తనకు 15-16 సంవత్సరాలు వచ్చిన దగ్గర నుంచి పని చేయడం మొదలెట్టమని చెప్తుంటాను. 500 రూపాయలైనా సరే... తను సంపాదించాలి. మా పిల్లల్లో పని పట్ల గౌరవం కలిగించాలనుకుంటున్నాను. నా దగ్గర అన్నీ వున్నాయి... లాంటి భావాలు వారిలో కలగ కూడదు. తన కాళ్ల మీద తను బతకగలనని నమ్మకంగా చెప్పగలగాలి. అదే మేమిద్దరం కోరుకునేది. ●

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

ఆరోగ్యం..ఆరాటం...

సినీ స్టార్లే కాదు. రాజకీయ నాయకులూ సెలబ్రెటీలే. వారికి సంబంధించిన అన్ని విషయాల పట్ల అమితాసక్తి సామాన్యులకు. తారల సినిమా హిట్టయినా ఫట్టయినా...సార్లు మేడమ్లు ఎన్నికల్లో గెల్చినా ఓడినా...షూటింగ్‌లో దెబ్బలు తగిలి ఆస్పత్రిపాలైనా...తెలుసుకోవాలని ఉవ్విళ్లూరతారు కామన్ పీపుల్.

ఇవాళ తమిళనాట పురుచ్చితలైవికి ఏమైందో తెలీక ఆ రాష్ట్ర వాసులు తెగ ఇదై పోతున్నారు. నిన్న కాక మొన్నే కదా దర్జాగా సీఎం కుర్చీ అధిష్టించారు. ఇంతలోనే ఏమైంది? ఆమె విదేశాల్లో ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? పొయస్ గార్డెన్‌కే ఎందుకు పరిమితమౌతున్నారు? సచివాలయానికి సరిగా రావడంలేదెందుకు? అని ఒకటే పరేషాన్ అవుతున్నారు. ఆమె అమితమైన బీపీ, సుగర్‌తో బాధపడుతున్నారని వినికిడి. పైగా కాలేయ మార్పిడి చికిత్స జరుగుతుందని ప్రచారం ఒకటి.అన్నీ కలిసి అటు అమ్మ అభిమానులను, కార్యకర్తలనే కాక సామాన్యులనూ నిలవనీయడం లేదు.

అక్కడదాకా ఎందుకు? మన సోదర రాష్ట్ర సీఎం కేసీఆర్‌కూ ఈ మధ్య పదిహేను రోజుల్లో మూడు సార్లు జ్వరం వచ్చిందని తెలిసి ఒకటే కంగారు. ఆయన మామూలుగానే ఫామ్ హౌస్‌లో ఎక్కువగా గడుపుతారు. అనారోగ్యం కూడా తోడవడంతో నల్ల పూసైపోయారు. ముఖ్యమైన అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొనలేకపోతున్నారని...ఒకరోజు ఎలాగో ఓపిక చేసి వచ్చినా అంత కులాసాగా లేరనీ పత్రికల్లో చదివి దిగులు పడ్డ సాధారణ ప్రజలూ వున్నారు. సార్‌కు త్వరగా నయమైతే బావుండని మనసులోనే మొక్కుకున్న వారూ వున్నారు.

అప్పట్లో సోనీయా గాంధీకి క్యాన్సర్ వ్యాధి సోకి చికిత్స నిమిత్తం విదేశాలు వెళ్లినప్పుడు సామాన్యులు సైతం ఎంతగా కంగారు పడ్డారనీ. ఆమెకు ఏ విధమైన చికిత్స చేస్తున్నారు? ఎప్పట్లోగా ఆరోగ్యవంతులౌతారు? వంటి అనేకానేక అనుమానాలను పత్రికల ద్వారానే నివృత్తి చేసుకున్నారు. ఆమె త్వరితంగా ఆరోగ్యవంతురాలు కావాలని యాగాలు, వ్రతాలు, ఉపవాసాలు, పూజలు చేసిన వారూ వున్నారు.

◆ మనలో మాట

కార్లలో ప్రయాణించే నేతలకు యాక్సిడెంట్ అయ్యిందని తెలిస్తే చాలు. ఎలా వుందో, ఏమైందో, దెబ్బలు బాగా తగిలాయా? ప్రాణాపాయం లేదుకదా! వంటి వివరాలను తెలుసుకోవడానికి అప్పటికప్పుడు ఆరాటపడిపోతారు. అలిపిరిలో బాబుగారికి యాక్సిడెంట్ అయినప్పుడు సరిగ్గా ఇలాగే స్పందించారు ప్రజలు.

అంత పిచ్చి ప్రేమ జనానికి నేతలంటే. వారికి ఇంత అనారోగ్యం కలిగినా తమకే వచ్చినట్టు తల్లడిల్లిపోతారు. కానీ అంత ప్రేమ, ఆతృత తమ కోసం అల్లాడిపోయే జనం మీద ఏలికలకు వుంటే ఎంత బావుండేది. జ్వరాలు, అంటు వ్యాధులు వచ్చి అల్లాడుతున్న సామాన్య ప్రజల కోసం వారు కూడా అంత ఆతృత పడితే ఎంత బాగుండు! పవర్‌లో వున్నంత కాలం ఏం చేసినా చేయకున్నా... తాజా వాగ్దానాలను నమ్మి మరోసారి తాజాగా ఓట్లేసే ప్రజల ఆరోగ్యం కోసం బడ్జెట్లో పదిశాతమైనా ఖర్చు చేస్తే ఎంత బావుండు? పుష్కరాలు, యాత్రల సందర్భంగా తొక్కిసలాటలు జరిగి అమాయకులు బలి కాకుండాతగుజాగ్రత్తలు తీసుకుంటే ఎంత బాగుండు? ఇవన్నీ నేతలకు ఎప్పటికి అర్థమౌతాయో మరి. ■

ఈ సంచికలో....

కళంకిత కమలం

కవర్ స్టోరీ —— 14

'**అ**...అమ్మ, ఆ...ఆవు' అని చెప్పుకునే రోజులు పోయాయి. 'అ...అవినీతి, ఆ...ఆశ్రిత పక్షపాతం' అనుకోవాల్సిన కాలం వచ్చేసింది. మాది భిన్నమైన పార్టీ. స్వచ్ఛమైన పార్టీ అంటూ జనాన్ని నమ్మించి మరీ గద్దెనెక్కిన బి.జె.పి వారూ తక్కువ తినలేదని నిరూపితమౌతోంది. మోడీ గేట్, వ్యాపమ్ స్కామ్, చిక్కీ కుంభకోణం, అగ్నిమాపకాల కొనుగోళ్ల స్కామ్ ఓ వైపు, నకిలీ సర్టిఫికెట్లు- అక్రమ చదువుల ఆరోపణలు మరోవైపు కమల నాథులకు పట్టపగలే చుక్కలు చూయిస్తున్నాయి. స్కాముల్లో చిక్కి మత దురభిమానానికి తోడు అవినీతి ఆభరణాన్నీ అలంకరించుకొని కళంకితగా మన ముందు నిలబడిన భాజాపా స్కాముల లీలా విలాసం ఏ స్థాయిలో వుందో ఈ వారం అట్టమీది కథలో.



జీవితం 3
'ఈ' నాగరికులు

నవ్వుల్ పువ్వుల్ 4

ప్రత్యేకం 5
పెంపుడు రాళ్లు

సినిమా కబుర్లు 6
రాగాల రారాణి

వింత లోకం 8
మనసున్న విందు

ఆదర్శం 9
డిజిటల్ గ్రామం

స్టార్ 10
సినీ గుర్రం

కవిత్వం 11
మనిషి కనపడని చోటు

కథ 18
ప్రసవం ఒక మరణం

రుచి 21
ఖీమా సాగ్

బాలనేస్తాలు 22
పిల్లల 'ఒలంపిక్స్'

కొత్త పుస్తకాలు 24
చక్కటి కథా గుచ్ఛం

టపా

అందరి కర్తవ్యం

ప్రతి ఒక్కరు చదివి అవగాహన పెంచుకోదగిన రచన. ప్రపంచంలోకెల్లా పొట్టి ఆవుల గురించి ఇవ్వడం చాల బాగుంది. బాలనేస్తాలు పజిల్స్ చాలా గమ్మత్తుగా ఉన్నాయి. రాళ్లలో ఇసుకల్లో చిత్రాలు పులకింపచేసాయి. మనలో మాట అందరి కర్తవ్యం.

సుభాష్ చంద్రబోస్, విశాఖ పట్నం

రక్తపు వాన

ఓ వైపు కరువు.. మరో వైపు వేడిగాలులతో నగర జనాభా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇక పల్లెటూర్ల గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మేలు. జూన్ మొదటి వారంలో రుతుపవనాలు కేరళను తాకుతాయని వాతావరణ శాఖ సూచించినా వర్షం లేదు. పల్లెటూరులో వరుణుడి రాక కోసం రకరకాల ప్రార్థనలు, ప్రయత్నాలు చేస్తున్నా అవి ఫలించడం లేదు. మెక్సికన్ మారుమూల గ్రామాలు వాన కోసం రక్తం చిందించడం ఆశ్చర్యంగా ఉంది.

దేవా, కమలాపురం

వాతావరణ మార్పులు

వానాకాలంలో సరైన వానలు పడవు. ఎండా కాలంలో ఉక్కపోతకు నగర జనాభా అతలాకుతలం అవుతోంది. వాతావరణ ంలో వస్తున మార్పులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవుడే కారణం అవుతున్నాడు. ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే మానవాళికే ముప్పు తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా మానవాళి మేలుకోవాలని కోరుకుంటున్నాను.

రాము, కడప

దుమ్ము దులుపు

హెల్మెట్ ఇనుప కవచం లాంటిది. తరుచు ప్రమదాల బారినుంచి కాపాడుకునే ఒక ఆయుధం. మన రాష్ట్ర ప్రభుత్వం హెల్మెట్ ధరించడం తప్పని సరి అని ఆదేశాలు జారీచేయడం గర్వించదగ్గ విషయం. నలుపు తెలుపు మనిషి జీవితంలో చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. రక్షణ వ్యవస్థలోకి ఎలుకలను వాడుకోవడం ఎంతో హేయమైన చర్య. వానకోసం వివిధ దేశాల వారు ఆచరించే సంప్రదాయాలు చాలా బాగున్నాయి. ఒక చక్కటి వ్యాసం ఇచ్చారు.

సోము, ప్రొద్దుటూరు

మానవ తప్పిదమే

మానవుడు ప్రకృతిని నాశనం చేస్తున్నందున వాతావరణానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. వానలు, ఎండలు సకాలంలో రావడం లేదు. చెట్లు, కొండలను నాశనం చేయడం వల్ల కర్బన ఉద్గారాలు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి. మొత్తం మీద చక్కటి స్టోరీ.

టి. శ్రీరామ మూర్తి, గాజువాక, విశాఖ

జమునను సైడ్ చేసిందెందరో!

తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసిన సినీ నటి జమునను ఇండస్ట్రీలో టాప్ పొజిషన్‌కు చేరకుండా గండి కొట్టిన దుష్టశక్తులు ఎవరో ఇండస్ట్రీలో అందరికీ తెలుసు. జయ శంకర్ మూలంగా ఆమె తలకి గాయం కావడం మాకు కొత్త విషయం. వివరించాల్సింది. వానలు కురవాలని కోరుకుంటూ మెక్సికో, పెరూల్లోని ప్రజలు ఒకరికొకరు రక్తం చిందేలా కొట్టుకోవడం విస్మయపరిచింది.

టి.సత్యనారాయణ మూర్తి, మల్కాపురం, విశాఖ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

బ్యాంకాక్
ఒక్కసారైనా చూడాల్సిందే -12

జీవితం

‘ఈ’ నాగరికులు

ఇప్పుడు నగరాలు కొత్తగా పలకరిస్తున్నాయి. అడుగడుగునా నగరజీవి కథ చెబుతున్నాయి. శ్రామికుడి కష్టం నుంచి యాసిడ్ విక్టిమ్ నరకం వరకు ప్రతిదీ సాటి నగర జీవులతో పంచుకుంటున్నాయి. ఓ వాచ్‌మన్ ఇంగ్లీష్ పాఠం నుంచి ఓ మిలియనీర్ జానపద పాట వరకు అన్నింటికీ పెద్ద పీట వేస్తున్న ఆ నగరంలో అంతరాలు లేవు. నగరజీవుల ముఖ చిత్రంగా మారిన ఆ డిజిటల్ నగరాలు నెట్‌లో విస్తరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో పొరుల్ని పోగేసుకుంటున్నాయి. వారి కథలను పోస్ట్ చేస్తూ అసలైన నగర జీవితాన్ని వైరల్ చేస్తున్నాయి.

మీరు ఫేస్‌బుక్‌నో, ట్విట్టర్‌నో, టంబ్లర్‌నో మరో సామాజిక మాధ్యమంలో యాక్టివ్‌గా ఉంటే మీకు కొన్ని ప్రత్యేక పోస్టులు కనిపిస్తాయి. హ్యూమన్స్ ఆఫ్ న్యూయార్క్, హ్యూమన్స్ ఆఫ్ ఇండియా, హ్యూమన్స్ ఆఫ్ ఇరాన్, హ్యూమన్స్ ఆఫ్ బాంబే, పీపుల్స్ ఆఫ్ పాకిస్తాన్, పీపుల్స్ ఆఫ్ చైనా అనే ఆ పేజ్‌లు కచ్చితంగా ఆకట్టుకుంటాయి. ఒక పోస్ట్‌ను తెరిచిన వారు వాటి మరిన్ని పోస్టులను స్క్రోల్ చేయకుండా ఉండలేరు. అంతగా కట్టిపడేస్తున్న వాటి ప్రత్యేక అంశాలేంటో అనే వారికి అక్కడ ఏ ప్రత్యేకత లేని నగర జీవి పలకరిస్తాడు. కాస్త వారి మాటల్లోకి వెళితే ఆ సామాన్య బతుకుల్లోని అసాధారణ విషయాలు మన మనుసుల్ని హత్తుకుంటాయి. బాంబే నగరంలో వడివడిగా నడుస్తున్న ఒంటిపై టాట్టూలున్న ఓ 50 ఏళ్ల మహిళను నవ్వుతూ పలకరించి తమ మాధ్యమం గురించి చెప్పారు. తన పరుగుల జీవితానికి ఓ బ్రేక్ ఇచ్చి కటువైన గతాన్ని ఎంతో బోల్డ్‌గా ఆమె వివరించి షాక్ ఇచ్చింది. విదేశాలకు వెళ్లి 15 ఏళ్లకే గ్యాంగ్ రేప్‌కు గురై తిరిగి స్వదేశానికి చేరుకుని ఆ దారుణ గతం ఆనవాళ్లు లేకుండా స్వతంత్రంగా ఎలా పరిస్థితులకు ఎదురీదిందో చిన్నపుడే తండ్రిని కోల్పోయిన ఆమె చెబితే దాన్ని పోస్ట్ చేసి చాలామందికి ధైర్యాన్ని నింపారు. ఎన్నో ఆశలతో పల్లెను వదిలి నగరానికి వచ్చి వాచ్‌మన్‌గా స్థిరపడిన వ్యక్తికి అక్కడే పరిచయమైన ఓ మిత్రురాలు తనకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పడమే కాక డిగ్రీ పూర్తయ్యేలా తనకు ఎలా ప్రేరణనిచ్చిందో కల్మశం లేకుండా చెబుతున్న యువకుడు.. ఇలా ప్రతి నేపథ్యం, ప్రతి వర్గం, ప్రతి కోణం ఇక్కడ పోస్టై పోతాయి. వాస్తవ నగర జీవితాన్ని కళ్లకు కడుతున్నాయి. సెలబ్రెటీలు కాకుండా సామాన్యుడి జీవిత కథలే ఇక్కడ చిత్రీకరణౌతాయి.

లక్షల మంది ఫాలో అవుతున్న ఈ పీపుల్స్, హ్యూమన్స్ ఆఫ్ సోషల్ వెబ్‌సైట్ పేజీలకు ప్రాణం పోసింది హ్యూమన్స్ ఆఫ్ న్యూయార్క్ అనే చెప్పుకోవచ్చు. కోటి ముప్పై లక్షల మంది కేవలం ఫేస్‌బుక్‌లోనే ఫాలో అవుతున్న దీనికి వెబ్‌సైట్, బ్లాగు, ట్విట్టర్ ఖాతా కూడా ఉన్నాయి. మన భారతీయుడి సక్సెస్ స్టోరీ నుంచి స్థానిక న్యూయార్కర్ ఎదురీత వరకు అన్నింటికీ స్థానం కల్పిస్తోన్న ఈ పేజీ నిర్వాహకుడు బ్రాండన్ స్టాంటన్ అనే యువకుడు. ఉద్యోగం నుంచి వెళ్లగొట్టడంతో ఫైనాన్స్ వృత్తికి స్వస్తి చెప్పిన ఓ సామాన్య న్యూయార్కరే ఆయన. అంత పెద్ద మహా నగరంలో తనబోటి వాళ్లు ఎంతో మంది తగులుతూనే ఉంటారు. తన కథ వాటిల్లో ఏ పాటిది అనుకుని నిరాశ చెందిన అతడికి ఆ నగర జీవనం వాస్తవం ఏంటో పదిమందికి చెప్పాలనుకున్నాడు. అలా మొదలైందే హ్యూమన్స్ ఆఫ్ న్యూయార్క్. ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ వెబ్‌సైట్‌గా సామాజిక మాధ్యమాల్లో లైక్‌లు కొట్టించుకుని ఇప్పుడు అదే ఓ మహా నగరమైపోయింది. దాని పోస్టులు కేవలం న్యూయార్కర్లనే కాదు ఆ నగరం గురించి అస్సలు పరిచయమేలేని మారుమూల ప్రాంతాల నెటిజన్లు ఫాలోవర్లు అయిపోయారు. పోస్టుల మీద పోస్టులతో వాల్స్‌ను నింపేయకుండా రోజుకో కథ చెబుతూ అందరికీ అవి చేరేలా చూడటమే దీని విజయ రహస్యం. 2010 నవంబర్‌లో ఫేస్‌బుక్ పేజీని తెరుచుకున్న ఈ వెబ్‌సైట్ కోసమని బ్రాండన్ నగరమంతా తిరిగి పదివేల మంది జీవితాల్ని, విశేషాల్ని సేకరించాడు. వారి ఫొటోలు పెట్టి క్లుప్తంగా వారి మాటల్లో వాళ్లను ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేస్తున్నాడు. సరిగ్గా జతకుదిరేలా క్వోట్స్‌ను కలిపి వారి అనుభవాలకు, మనోభావాలకు, అనుభూతులకు, గతాలకు, లక్ష్యాలకు అదనపు అందాన్ని తీసుకొచ్చాడు. ఈ నగరాన్ని పుస్తకంలా కూడా రాశాడు. తర్వాత ఇరాన్‌లో తిరిగి పీపుల్ ఆఫ్ ఇరాన్ పేజీని జతచేశాడు. ప్రఖ్యాత దినపత్రికల నుంచి సామాజిక సంస్థల వరకు అతడి కృషికి అవార్డులనందించి గౌరవించాయి. ఆ స్ఫూర్తితోనే అంతర్జాల ప్రపంచమంతటా సామాజిక మాధ్యమాల నగరాలు విస్తరించాయి. ప్రపంచంలోని ప్రతి నగరానికి ప్రాతినిధ్యం వహిస్తూ వాటి ముఖ చిత్రాలుగా నెట్ ప్రపంచంలో రీపోస్ట్ అవుతున్నాయి. మన దేశంలో ‘హ్యూమన్స్ ఆఫ్ ఇండియా, హ్యూమన్స్ ఆఫ్ బాంబే, హ్యూమన్స్ ఆఫ్ పూణె, హైదరాబాద్, బెంగళూరు’ ఇలా ఎన్నో ఇపుడు ఫేస్‌బుక్‌లో ఉన్నాయి. 2012లో ప్రారంభమైన హ్యూమన్స్ ఆఫ్ ఇండియాకు రెండు లక్షల మంది వరకు ఫాలోవర్లున్నారు. ‘బ్లాగర్స్ విత్‌ఔట్ బోర్డర్స్’ నిర్వహిస్తున్న ఈ పేజీకి టైమ్ మేగజైన్ గుర్తింపుతో పాటు ఎన్నో అవార్డులు వచ్చాయి. ఇవి తాము స్వతహాగా రూపొందించిన పోస్టులతోపాటు తమకు అందిన మెయిల్స్ ద్వారా కూడా నగరజీవి స్వంత రాతలకు పట్టం కడుతున్నాయి. పోస్టు పోస్టుకూ కొత్త కథ, కొత్త జీవితం, కొత్త మనిషి మనకు పరిచయం అవుతాడు. ఓ పది పోస్టులు తిరగేస్తే వారి జీవితాల వైరుధ్యం, నగర జీవన వైవిధ్యం కళ్లకు కడుతుంది.

- అజయ్ కుమార్ వారాల

నవ్వుల్ – పువ్వుల్



అప్పుడే పెళ్లా

విలేకరి: మీ పెళ్ళి గురించి చెప్పండి

సినీతార: నా వయస్సు పాతిక కూడా నిండలేదు. అప్పుడే నాకు పెళ్ళేంటి?

విలేకరి: మరి మీ చెల్లెలు కూడా బిజీగా ఉంటూ పెళ్ళి చేసుకుంది కదా…!

సినీతార: దాని వయస్సు ఎప్పుడో 30 దాటింది . అందుకే అది తొందర పడింది.

ఎలా ?

అప్పారావు : ఒరే సుబ్బా నా భార్యకి రెండు లక్షలు, పెద్ద కొడుక్కి మూడు లక్షలూ , చిన్న కొడుక్కి నాలుగు లక్షలూ చెందేటట్టు వీలునామా రాశాను

సుబ్బారావు: మరింక విచారం దేనికి?

అప్పారావు : అంత డబ్బు ఎలా సంపాదించాలో అర్థం కావట్లేదురా!

మేడిన్ జపాన్



నిన్న నాకు రేడియో అమ్ముతూ 'ఇది మేడిన్ జపాన్' అని చెప్పావు కదా ఇంత మోసం చేస్తావనుకోలేదు

మోసమా ఏం మోసం చేశాను

ఇంటికెళ్లాక రేడియో ఆన్ చేస్తే 'దిసీజ్ ఆలిండియా రేడియో' అని స్పష్టంగా చెప్తోంది ఓ అమ్మాయి.

ఉంగరం

అమ్మాయి: రేపు ప్రేమికుల రోజు. నాకు రేపు సాయంత్రం నువ్వు రింగ్ ఇస్తావా

అబ్బాయి: తప్పకుండా. దేన్నుంచి రింగ్ ఇవ్వమంటావు.. సెల్‌ఫోన్ నుంచా లాండ్ లైన్ నుంచా?

ధర్మం

భిక్షగాడు : బాబూ! వంద ధర్మం చెయ్యండి గుడ్డివాణ్ని

వెంగళప్ప: నీకు కళ్ళు లేవని ఎలా నమ్మాలి?

భిక్షగాడు: అక్కడ చెట్టుకింద ముగ్గురు కూర్చుని ప్రసాదం తినడం మీరు చూస్తున్నారా? నాకు కనిపించడం లేదు బాబూ!

వెంగళప్ప: అయ్యో పాపం ! ఇదిగో వంద.......

సిమ్ కార్డు

నేను సెల్ ఫోన్ అయితే నీవు సిమ్ కార్డువు చెప్పింది ప్రేమసి.

యురేకా అంటూ కేకాలేశాడు ప్రియుడు.

ఓవర్ యాక్షన్ చేస్తే సిమ్ కార్డు మార్చేస్తా వార్నింగ్ ఇచ్చింది ప్రేయసి.

మోసగాడు

వెంగళప్ప ఎప్పటిలాగే ఇంటి పక్కనున్న సూపర్ బజార్‌కి వెళుతున్నాడు

అయోమయం: ఏరా ! ఎక్కడికి బయలుదేరావ్?

వెంగళప్ప: సరుకులు తేవడానికి సూపర్ బజార్‌కి వెళుతున్నాను

అయోమయం: ఆ సూపర్ బజార్‌కి వెళ్లకురా షాపు ఓనర్ పచ్చి మోసగాడు. మొన్నా ఒక స్వీట్ ప్యాకెట్ కొన్నాను. దానిపై షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. ఇంటికెళ్లి ప్యాకెట్ విప్పి చూస్తే అందులో ఏ మాత్రం షుగర్ లేదు.





గ్యారీ

పెంపుడు రాళ్లు

అమెరికా రాళ్లను పెంచింది. వాటికి ముద్దు పేర్లు పెట్టింది. వాటిని షికార్లకు తీసుకెళ్లింది. చివరకు పెట్ హౌజ్‌లను కట్టింది కూడా. పెంపుడు రాళ్ల వెర్రిని అమెరికన్ల నరనరాన ఎక్కించింది గ్యారీ రాస్ డాహ్ల్ అనే మార్కెటింగ్ కింగ్. రంగు రాళ్లలా విలువైనవి కాని ఇసుక రాళ్లనమ్మి కోట్లు మూటగట్టాడు. చిన్న ఆలోచనతో ఓ ట్రెండ్‌ను సృష్టించిన ఆయన వ్యాపార విజయం మార్కెటింగ్ మాయే.

ఎంత విలువైన వస్తువైనా సరైన మార్కెట్ వ్యూహం లేక దెబ్బతిన్న వ్యాపారాలెన్నో. కోట్లు ఖర్చు చేసి సృష్టించిన అద్భుతాలూ ప్రచారం లేకపోతే వెలవెలపోవాల్సిందే. అదే సరైన మార్కెట్ టెక్నిక్ వంటబడితే మట్టి రాళ్లకు కూడా మణి మాణిక్యాల స్టేటస్ తేవొచ్చు. గ్యారీ రాస్ చేసిందదే. కాలిఫోర్నియాలోని లాస్ గెటోస్‌లో ఓ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా పనిచేస్తున్న గ్యారీ ఐడియాలు బ్రహ్మాండంగా ఉండేవి. అతడి ప్రచార వ్యూహాలతో లాభాలు గడించినవారెందరో ఉన్నారు. కానీ, గ్యారీ మాత్రం ఉద్యోగిగానే మిగిలిపోయాడు. ఆ రోజుల్లో ఓ సారి బార్‌కెళ్లి విందు లాగిస్తున్న గ్యారీకి చుట్టుతా ఉన్న జనాల మాటలు చెవిన పడ్డాయి. వారి గోలంతా పెంపుడు జంతువుల గురించే. వాటికి తిండి పెట్టడం నుంచి కార్యక్రమాలకు బయటకు తీసుకెళ్లే వరకు వారి కష్టాల లిస్టు చేంతాడంత. ఒకరి పెంపకం ఒకరు చెప్పుకుంటూ బాధ పంచుకుంటున్న వారిని చూసి గ్యారీకి జాలేసింది. అలాగే నవ్వొచ్చింది కూడా. ఇంతలోనే టక్కున మరో ఆలోచన కూడా వచ్చింది. వాళ్లని ఆట పట్టించడానికి తన 'పెంపుడు రాయి' గురించి గొప్పలు చెప్పడం ప్రారంభించాడు. అది తన మాట జవదాటదని, ఎక్కడ పెడితే అక్కడే కదలకుండా కూర్చుంటుందని, అస్సలు అల్లరి చేయదని, తను తీసుకెళ్లేదాకా గడప దాటదని, గోలగోలగా అరవదని, తన ఫర్నీచర్‌ను, ఇంటిని కంపు కంపు చేయదని ఊదరగొట్టాడు. నిజంగా రాయిని పెంచుకోవచ్చనుకున్న ఆ వెర్రి జనాలకు ఆ ఆలోచన వెరీ ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. మాకూ అలాంటి పెంపుడు రాయిని ఇప్పించవూ అని ఆయన వెంటబడ్డారు. అలా గ్యారీ 'పెట్ రాక్స్' పేరిట కంపెనీ ప్రారంభించేందుకు నాంది పలికింది.

పెన్నీ నుంచి మిలియన్లకు..

70వ దశకంలో మొదలైన ఆ వర్తకం తొలుత ఇద్దరు ఇన్వెస్టర్లకు రాయికి పెన్నీ చొప్పున ఓ బాక్స్ మెక్సికన్ బీచ్ ఇసుక రాళ్లను అమ్మాడు. వాటిని కొనేందుకు వినియోగదారులను ఆకర్షించేందుకు చాలా ప్రయత్నాలే చేశాడు. విఫలమయ్యాడు. ఈ ప్రయత్నాల్లోనే ఓ గొప్ప ఆలోచన చేశాడు. ఆ రాళ్లను రవాణా చేసేందుకు వాటికి గూడుగా ఓ కార్డ్ బాక్స్‌ను రంధ్రాలతో రూపొందించాడు. లోపల మెత్తటి కుషన్‌లా పనిచేసే రంపపు పొట్టును చల్లాడు. రంధ్రాల ద్వారా రాళ్లు ఊపిరి పీల్చుకుంటాయని రాసుకున్నాడు. ఆ ప్రత్యేక బాక్స్‌కు అదనంగా ఆ రాళ్లను ఎలా జాగ్రత్తగా పెంచుకోవాలనే విషయాలతో ఓ మాన్యువల్‌ను జత చేశాడు. ఇది సంచలనమై క్రేజ్ ఆకాశాన్నంటింది. 'దీన్ని బాక్స్‌లో నుంచి తీయగానే కంగారుపడుతుంది. అది సహజం. వెంటనే పాత న్యూస్ పేపర్ల మీద ఉంచండి.' 'పేపర్లు ఎందుకో మీ పెంపుడు రాయికి తెలుసు. మీరు తీసేంత వరకు అవి వాటికి కాపలా కాస్తాయి.' 'వాటికి మంచి ముద్దు పేర్లు పెట్టండి. అప్పుడప్పుడు షికార్లు తిప్పండి.' అంటూ సాగే మాన్యువల్ మాటలు కొనుగోలుదారులకు సరదాగా తోచాయి. ఈ తుంటరి పెట్ రాక్స్ విజయానికి మరో కారణం కూడా కలిసి వచ్చింది. వియత్నాం యుద్ధం, వాటర్‌గేట్ కుంభకోణాలతో సతమతమై కుంగిపోయిన అమెరికన్ల మోములో నవ్వు విరబూయించాయివి. తక్కువ ధరే కావడం, సరదాగా ఉండటంతో వాటిని సొంతం చేసుకోవడం ఫ్యాన్సీ అయిపోయింది. 1975 క్రిస్‌మస్ సందర్భంగా ప్రఖ్యాత టీవీ కార్యక్రమం 'టునైట్ షో'లో గ్యారీ పాల్గొని ఆసక్తికరంగా ఆ రాళ్ల విశేషాలు పంచుకోవడంతో మీడియా బూస్ట్ తోడైంది. అంతే అమ్మకాలు అమాంతంగా పెరిగిపోయాయి. కొన్ని నెలల్లోనే రాయికి 4 డాలర్ల చొప్పున 15 లక్షల రాళ్లను అమ్మేశాడు. స్విమ్మింగ్ పూల్ ఉన్న ఓ పెద్ద భవంతిని, మెర్సిడెస్ బెంజ్ కారును కొనుగోలు చేశాడు. తర్వాత పోటీగా ఎందరో వ్యాపారం చేయడం, క్రేజ్ క్రమక్రమంగా తగ్గడం, గ్యారీ కూడా విసుగు చెందడంతో లాస్ గెటోస్‌లో ఓ ఖరీదైన సెలూన్ వ్యాపారం పెట్టాడు. తిరిగి అడ్వర్టైజ్‌మెంట్ రంగంలోకి వెళ్లి 2001లో 'అడ్వర్టైజింగ్ ఫర్ డమ్మీస్' అనే పుస్తకాన్ని రచించాడు. ఆయన ఎంత సెలబ్రెటీ అయిపోయాడంటే వింత వింత ఆలోచనలతో, చెత్త వస్తువులతో చాలామంది ఆయన ఇంటి గుమ్మం దగ్గర వేచి ఉండేవారట. గ్యారీ ఎలాగైనా వాటిని మార్కెట్ చేయాలని వెంటపడేవారట. ఈ పెట్ రాక్స్‌కు పోటీగా బైసెంటినల్ రాక్స్ పేరిట అమెరికా పతాకం ముద్రించిన రాళ్లు మార్కెట్‌లోకి వచ్చాయి. అయినా పెట్ రాక్స్‌కు వచ్చిన క్రేజ్ వేరే వాటికి దక్కలేదు.





'పాల మీగడ కన్నా.. పంచదార కన్న
జుంటి తేనె కన్న.. జున్ను కన్న
తేనె ఊట కన్న.. తెలుగు పాటే మిన్న..'
ఆ పాట సుశీల నోట అన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.
'పాల కడలిపై శేష తల్పమున పవళించేవా దేవా..'
చెంచులక్ష్మి చిత్రంలోని పాట విన్నా.
'వటపత్రశాయికి వరహాల లాలి..' స్వాతి ముత్యం చిత్రం పాట
వరకు ఆమె గాత్రమిచ్చిన అన్ని పాటలూ ఆణిముత్యాలే.
తెలుగు అక్షరాలు తేనె అలల మధ్య స్నానం చేసి సంబరంగా
ఒళ్ళు విరుచుకున్నట్టుగా ఉంటాయి ఆమె గొంతుకలో. ఆమె పాట
ఓ మాధుర్యం. ఆమె పాట ఓ అద్భుతం.

రాగాల రాణి

విద్యల నగరం విజయనగరం అంటేనే కళలకు పుట్టినిల్లు. ఆదిభట్ల నారాయణ దాసు, ద్వారం వెంకటస్వామి నాయుడు, ఘంటసాల మాస్టారిని అందించిన విజయనగరం సుశీలమ్మనూ అందించింది. విజయనగరంలో పులపాక ముకుందరావు లీడింగ్ ఎడ్వకేట్. చిన్నతనం నుంచి నాన్న కూతురిగా పెరిగిన సుశీలమ్మ స్వతహాగా భయస్తురాలు. ప్రాథమిక విద్యని అభ్యసిస్తున్నా చదువు కంటే పాటల మీద ఎక్కువ మోజు చూపించేది. చదువుకుంటే జీవితం సాఫీగా సాగుతుంది. ఈ కళలు కడుపు నింపుతాయా! అనే మాటలు ఎక్కువగా వినిపిస్తుండేవి ఆ రోజుల్లో. అందునా ముకుందరావు మంచి చదువరి. అందుకే సుశీలమ్మ భవిష్యత్తుని గురించి కలవరపడుతుండేవారు.



ఎం.ఎస్ విశ్వనాథన్, ఎస్.పి బాలుతో..

పాటల్లా అనిపించే సుశీలమ్మ మాటలకు ముకుందరావుతో పాటు చిన్నాన్న సీతాపతిరావు కూడా పులకించిపోయేవాడు. ఇంకేముంది మహారాజా వారి సంగీత కళాశాల సిద్ధంగా ఉంది .పైగా మహానుభావుడు ద్వారం వెంకట స్వామి నాయుడు ఆ సంగీత కళాశాలకి ప్రధానాచార్యులు, సంచాలకులు. ఆయన శిష్యరికంలో సరిగమ పదనిసలు నేర్చుకోవడం సుశీలమ్మ పూర్వజన్మ సుకృతం! అంటుంది. అక్కడ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. విజయనగరంలో ఎక్కువగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా సుశీలమ్మ ముందుండేది. సుశీలమ్మ గొంతు వినిపించాల్సిందే. ప్రశంసలు పొందాల్సిందే. సుస్వర మాధుర్యంతో బాటు భావప్రకటనకు ఘనాపాటీలు సైతం ఆశ్చర్య పోయేవారు, ఆనందపడేవారు. ఆ ఉత్సాహంతో ఆలిండియా రేడియోలో కూడా పాటలు పాడింది. సుశీలమ్మ గొంతు విన్న వాళ్ళందరూ మధురానుభూతికి లోనయ్యేవారు. ఆ నోటా ఈ నోటా చెన్నై ఎ.వి.యం వారి సరస్వతి రికార్డింగ్ కంపెనీకి చేరింది. సంగీత కళాకారుల ప్రతిభని గుర్తించి, వారికి నెల జీతాలకు మాట్లాడి కాంట్రాక్టు పద్ధతిన మ్యూజిక్ ఆల్బమ్స్ చేయించేవాళ్లు. అప్పుడే వెండ్రల నాగేశ్వరరావుకు పరిచయమైంది. సుశీలమ్మ పాట విని ముగ్ధుడై "కన్నతల్లి" చిత్రంలో పాట పాడించాడు. తమిళం, తెలుగు భాషల్లో సుశీల పాడింది. సుశీలమ్మ రెండు వందల రూపాయిల నెల జీతం మీద పని చేస్తుండేది. ఎ.వి.యం సంస్థలో ఒకసారి కాంట్రాక్టుకి ఒప్పందం జరిగిన తర్వాత బయటపడటం అంత తేలికైన పనికాదు. అయినా సుశీలమ్మ వేరే సంస్థలకు పాడేందుకు వీలు కల్పించారంటే అది సుశీలమ్మ పట్ల గల ప్రేమాభిమానాలే.

సుశీలమ్మ తెలుగు సినీ పరిశ్రమలోకి ప్రవేశించే సరికి దిగ్గజాల్లాంటి గాయనీమణులుండేవారు. పి.లీల, ఎం.ఎల్ వసంత కుమారి, రాశి, సరోజ, జమున వుండేవారు. వీరితో పాటు భానుమతి, శాంతకుమారి, యస్.వరలక్ష్మి, కన్నాంబ, రుష్యేంద్రమణి లాంటి నటీమణులు వారి పాటలు వారే పాడుకునేవారు. సుశీల సంగీతంలో మెళకువలు, కర్ణాటక సంగీత నేపథ్యం ఉండటం వలన తొందరగా పేరు తెచ్చుకుంది. చిత్రం ఏమిటంటే తెలుగును ఎంత చక్కగా ఉచ్చరించేదో, తమిళాన్ని అంత చక్కగా ఉచ్చరించేది. ఎ.వి.యం. వారు సుశీలకు తమిళంలో ఏ పదాలు ఎలా పలకాలో పదానికి అర్థం ఎలా పాట ద్వారా స్ఫురింపచేయాలో అనే విషయాల్ని తమిళ సంగీత నిష్ణాతుల చేత తర్ఫీదు ఇప్పించేవారు. అది చక్కగా అవగాహన చేసుకున్న సుశీలమ్మ తెలుగు పాటలు ఎంత సుళువుగా పాడేదో తమిళ పాటలూ అంతే సునాయాసంగా పాడేది. మొట్టమొదట విడుదలైన "కనవన్‌కండ దైవమ్" సినిమాలో సుశీల పాడిన పాటకు మంచిపేరు వచ్చింది.

ఎం.ఎస్.విశ్వనాథన్ సుశీలమ్మని చాలా ప్రోత్సహించారు. ఆయన స్వరం అమృతధార. దానికి సుశీలమ్మ గొంతు తోడైతే ఇక చెప్పేదేముంది? కర్ణ

జేసుదాసుతో...

వివిగిరి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకుంటూ...



బాల సుశీల

భర్తతో..

చిత్రంలోని 'గాలికి కులమేది..' పాట అమృత ధార కురిపించింది. దక్షిణామూర్తి సారథ్యంలో తమిళం, మలయాళం సినిమాల్లో ఎక్కువగా జేసుదాసుతో యుగళ గీతాలు పాడి చాలా మంచిపేరు తెచ్చుకుంది. 1969 లోనే ఎం.ఎస్.విశ్వనాథన్ తమిళ ఉమురింద మనిదన్ చిత్రానికి గాను జాతీయ అవార్డు గెలుచుకుంది.

సుశీలమ్మ జీవితంలోని పాటల మధురమైన మజిలీ ఘంటసాల మాస్టారితోనే అని చెప్పి తీరాలి. ఏ రాగం ఎక్కడ, ఎలా పలికితే పాట ప్రేక్షకులకు ఎంత బాగా కనెక్ట్ అవుతుందో విడమరిచి ఆయన చెప్పేవారు. ఘంటసాల, యస్.రాజేశ్వరరావు, కె.వి.మహదేవన్, దక్షిణామూర్తి, యస్.పి., కోదండపాణి, ఆదినారాయణ రావు, మాస్టర్ వేణు, టీవీ రాజు, అష్టావధానులతో కలసి సుశీల గీతాలాలపించారు. పెండ్యాల, యం.యస్. విశ్వ నాథన్‌ల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

నూరేళ్ళ ఆయుష్షు

ఓ మహాసముద్రం దగ్గరికెళ్ళి ఎన్ని కడవలు నీళ్ళు తీసుకెళ్లగలవు? అంటే ఏం చెప్పగలం. భీష్మ చిత్రంలో 'మహదేవశంభో..', 'మనసులోని కోరిక..', నర్తనశాల చిత్రంలో 'నరవరా.. కురువరా..', 'దరికి రాబోకు రాబోకు రాజా..', గుండమ్మకథలో చల్లగాలికి 'కనులు తెరచినా నీవాయె..', చదువుకున్న అమ్మాయిలు చిత్రంలో 'వినిపించని రాగాలే..' 'నాదీ ఆడజన్మే'లో 'కన్నయ్యా నల్లని కన్నయ్యా..', 'రక్త సంబంధం'లో 'చంద్రుని మించు అందమొలికించు ముద్దుపాపాయివే..', 'డాక్టర్ చక్రవర్తి'లో 'పాడమని నన్నడగవలెనా..', 'ఆరాధన'లో 'నీ చెలిమి నేడే కోరితిని..' 'ఆత్మబలం'లో 'చిటపట చినుకులు పడుతూ వుంటే..', 'సుమంగళి'లో 'కనులు కనులతో కలబడితే..', 'మంచి మనసులు'లో 'నన్ను వదిలి నీవు పోలేవులే..', 'వాగ్దానం'లో 'నా కంటి పాపలో నిలిచిపోరా..', 'పవిత్రబంధం'లో 'పచ్చబొట్టు చెరిగిపోదులే.., 'లేతమనసులు'లో 'అందాల ఓ చిలక..', 'సిరిసిరి మువ్వ'లో 'ఝుమ్మంది నాదం..', 'మేఘసందేశం'లో 'నిన్నటి దాకా శిలనేగా..' ఇలా ఎన్నెన్నో మధుర గీతాలు.

పి. సుశీల ట్రస్టు

2008లో పి.సుశీల ట్రస్టు ప్రారంభమయ్యింది. ప్రతి సంవత్సరం నవంబరు 13న సుశీల ట్రస్టు ద్వారా ఇంత వరకు యస్.జానకి, వాణి జయరాం, ఎల్.ఆర్. ఈశ్వరి, పి.జయచంద్రన్, ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యం, కె.జె.జేసు దాసులను సన్మానించారు. ఆ సరస్వతి వాణిగా అనిపించే సుశీల ధన్యజీవి.. రేపటి తరానికి స్ఫూర్తి ప్రదాయిని.

ఇందిరా గాంధీతో....

అవార్డులు రివార్డులు

సుశీలకు అయిదు జాతీయ అవార్డులు వచ్చాయి. అందులో మూడు చిత్రాలు తెలుగు చిత్రాలే. సిరిసిరి మువ్వ, మేఘసందేశం, ఎం.ఎల్.ఎ ఏడుకొండలు చిత్రాలు. పదకొండు ప్రభుత్వ అవార్డులను కేరళ, తమిళనాడు, ఆంధ్రదేశం కలిపి అందించాయి. వాటిలో రెండు కేరళ, మూడు తమిళనాడు ప్రభుత్వాలు ఇచ్చినవి. ఇవి గాక స్వచ్ఛంద సేవా సంస్థలు ఇచ్చిన అవార్డులెన్నో. భారత ప్రభుత్వం 2008లో పద్మభూషణ్ అవార్డుతో సుశీలను సత్కరించింది. తమిళనాడు ప్రభుత్వం కళైమామణి అవార్డుతోనూ, సినిమా కోసమై లైఫ్ టైమ్ కంట్రిబ్యూషన్ అవార్డుతో సత్కరించి గౌరవించింది. జాతీయ అవార్డుని గెలుచుకున్న మొట్టమొదటి గాయని సుశీల అనే చెప్పుకోవచ్చు. అలాగే రఘుపతి వెంకయ్య అవార్డు పొందిన గాయని కూడా సుశీలమ్మగానే చెప్పాలి.

ఆరోగ్యకరమైన పోటీ

జానకి, జమున, రాశి, యల్.ఆర్.ఈశ్వరి, జిక్కి, రాశి, సరోజలతో ఎప్పుడు ఆరోగ్యకరమైన పోటీ ఉండేదని సుశీల చెప్పారు. అందరం కలిసి మెలసి ఉండేవారని, జానకి దేవుడిచ్చిన సోదరి అంటారు సుశీల. గాయని చిత్ర శ్రద్ధతో, వినయ సంపదతో పైకి రావడం చాలా గర్వకారణమని, నేటి పిల్లలు పోటీపడి గొప్పగా పాడుతున్నారని ఆనందం వెలిబుచ్చారు.సంగీతాభిమానుల గుండెల్లో చోటు సంపాదించుకోవడం తమ అదృష్టమని, ఈజన్మకి ఇది చాలంటారు. యాభై ఏళ్లపాటు తమ గాత్రంతో పాటలకు జీవాన్నందించి అజరామరం చేశారు సుశీలమ్మ.

-ఇమంది రామారావు,

9010133844

ఎ.ఆర్.రెహ్మాన్‌తో...

జానకి,పి.బి.శ్రీనివాస్, వాణీ జయరాంతో...

పి.లీలతో...

మనసున్న విందు

ఇస్తాంబుల్‌లోని డౌన్ కేఫ్ చాలా ప్రత్యేకమైంది. పేరుకు తగ్గట్టు దానిలో పని చేసేదంతా డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నవాళ్లే. 18 నుంచి 25 ఏళ్ల వయసున్న అక్కడి ఉద్యోగులు ఆప్యాయంగా వినియోగదారులకు వడ్డిస్తారు. సారుహన్ సింగెన్ దీని యజమాని. ఆయన కూతురికి ఈ సిండ్రోమ్ ఉంది. ఎదుగుదలకు సవాలైనా ఆ వ్యాధిపై పైచేయి సాధిస్తూ తన కూతురు లాంటి వాళ్ల స్వతంత్రంగా బతకాలనే కాంక్షతో ఈ కేఫ్‌ను స్థానిక ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రారంభించాడు. ఉద్యోగుల తల్లులకు వంట పనిని అప్పగించాడు. తొలుత ఇక్కడకు వచ్చేందుకు వెనుకా ముందు ఆడినవాళ్లే ఆహ్లాదంగా ఉండే పరిసరాలు, సమర్థవంతంగా పని చేసే ఉద్యోగులు, వినియోగదారుల పట్ల శ్రద్ధ చూసి డైలీ కస్టమర్లు అయిపోయారు.

వింత లోకం

ట్రక్కే ఇల్లు

న్యూజిలాండ్‌కు చెందిన జస్టిన్, జోలా సీజెన్ దంపతులకు జీవితమంతా ప్రయాణమే. సంసారమూ ప్రయాణంతోనే. చేసేది లేక ఓ ట్రక్కునే ఇల్లుగా మార్చేసుకుని తమ పిల్లాడితో దేశమంతా తిరుగుతున్నారు. మామూలు ట్రక్కు కాదండోయ్. పడక గది, వంట గది, స్నానాల గదితో పాటు మంచి లొకేషన్‌లో తానాలాడేందుకు రూఫ్‌టాప్ బేత్ టబ్‌ను కూడా దానిలో సర్దేశారు. జోలా ఓ ఆక్రోబాట్. ఆమె ప్రదర్శనలిచ్చేందుకు దేశమంతా తిరగాలి. సాదా సీదాగా ఉంటే బోర్ కొట్టేస్తుందని, శాశ్వతంగా దాన్ని వాడే ఉద్దేశంతో చాలా సృజనాత్మకంగా ట్రక్కును ఇల్లుగా మార్చాడు జస్టిన్. ఆర్కిటెక్చర్ అంటే ప్రాణమైన జస్టిన్ ఎంతో కళాత్మకంగా ఆ ట్రక్కును నివాసయోగ్యంగా తీర్చిదిద్దాడు. పాత మ్యూజిక్ సాంగ్ బుక్స్‌తో బెడు రూమ్‌కు అందంగా రూపొందించాడు. ఆటోమేటిక్ లైటింగ్‌తోపాటు లాంజ్ ఏరియా, బాల్కనీలున్నాయి. వాషింగ్ మెషీన్ నుంచి కుట్టు మిషన్ వరకు ప్రతిదీ పొందిగ్గా అమర్చాడు. మామూలు ఇంటికన్నా ఈ కదిలే ఇల్లే తెగనచ్చేసిందట జోలాకు.

పిల్లను వెదకరూ..

హార్వార్డ్ బిజినెస్ స్కూల్లో పట్టా పొందిన రెన్ లూ యూకు సరైన గర్ల్‌ఫ్రెండ్ దొరక్క ఓ వింత ప్రకటనతో ముందుకొచ్చాడు. తనకు తగ్గ పిల్లను వెదికిపెడితే ఆరు లక్షల రూపాయలకు తగ్గకుండా సమర్పించుకుంటానని తన వెబ్‌సైట్‌లో పెట్టాడు. చాలా ఆన్‌లైన్ డేటింగ్ వేదికల ద్వారా అమ్మాయిలతో పరిచయం పెంచుకున్నా అవన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. సిగరెట్ తాగే అలవాటు లేదంటూనే కారు దిగగానే పీకను నోట్లో పెట్టుకున్న పిల్లను చూసి కంగారు పడ్డాడడట రెన్. ఇలాంటి అనేకానేక అనుభవాలతో... ఎవరినీ నమ్మాలో... ఎవరితో జీవితాన్ని పంచుకోవాలో తెలీక తల్లడిల్లుతున్న సమయాన ఈ ఐడియా తట్టింది అతడికి. డేటింగ్‌కు ఎంపికైన అమ్మాయి నచ్చితే పెళ్లి కూడా చేసుకోవచ్చని ఆఫర్ ఇస్తున్నాడు ఈ మగమారాజు. అమ్మాయిలు నేరుగా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేస్తే రిజెక్ట్ చేసేస్తాడట. ఆ పిల్ల గురించి పూర్తిగా తెలుసుకున్న వారే తనకు సమాచారం ఇవ్వాలని, ఆరు నెలలు ఆమెతో స్నేహం చేశాక ఆ మొత్తం ఇస్తానని చెబుతున్నాడు.

ఆదర్శం



డిజిటల్ గ్రామం

దేశపు తొలి డిజిటల్ గ్రామం అకోదర ఓ పాఠం చెబుతోంది. డిజిటల్ ఇండియాకు రూరల్ ఇండియా ఎలా సిద్ధం కావాలో వివరిస్తుంది. కిరాణా సామానును మొబైల్ పే ద్వారా కొనుగోలు చేస్తున్న ఆ గ్రామం డిజిటల్ విజయం ప్రేరణే కాదు, సంసిద్ధత మిగతా గ్రామాలకు చేరాలి.

గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలోని అకోదరలో ఉదయం కొత్తగా మొదలవుతుంది. టాబ్లెట్ అలారమ్‌లు పిల్లల్ని నిద్ర లేపుతున్నాయి. బడికి వాళ్లు రెడీ అయ్యేలోగా, పెద్దలు స్థానిక సహకార సంఘం దగ్గర పాలను పోసి వాటి డబ్బు బ్యాంకు అకౌంట్‌లో పడిందే లేదోనని మొబైల్‌లో మెసేజ్ చూసుకుంటున్నారు. కిరాణా సామాను కొన్నవారు మొబైల్ పే ద్వారా డబ్బు చెల్లించి ఇంటికి చేరుకుంటారు. వారికి తెలియక పోతే కొట్టు యజమాని కొత్తవారికి నేర్పిస్తాడు. బడికి విద్యార్థులు చేరుకోగానే ఈ-అటెండెన్స్ పడి తల్లిదండ్రులకు పిల్లాడు క్షేమంగా చేరుకున్నాడని మెసేజ్ వెళ్లిపోతుంది. పుస్తకాలు తెరిచే బదులు టాబ్లెట్లు తెరిచి హోం వర్కును మాస్టారుకు చూపించగానే, తరగతులు ప్రారంభమైపోతాయి. నల్లబోర్డుపై చాక్‌పీస్ కీచుమనే శబ్దాల బదులు ఆడియో విజువల్ పాఠాలు రంగుల్లో ప్రొజెక్టర్ తెరపై ప్రత్యక్షమవుతాయి. విద్యార్థుల బుర్రలోకి తేలిగ్గా ఇంకిపోయేలా సరదాగా, ఆసక్తికరంగా సైన్సు పాఠాలు హత్తుకుపోతాయి. విశ్వం పుట్టుక, నానో టెక్నాలజీ రహస్యాల్ని చిత్రాలు, వీడియోల్లో చూసినవారికి సినిమా సన్నివేశాల్లా గుర్తుండిపోతాయి. సాయంత్రానికి పెద్దలంతా రచ్చబండ దగ్గరకు చేరి గ్రామంలోని వైఫై ద్వారా వ్యవసాయ సమాచారం, మార్కెట్ ధరలు, వార్తలు, ప్రపంచ విషయాల గురించి చర్చల్ని మొదలెట్టేస్తారు. కుర్రాళ్లు తమకు నచ్చిన డ్రసుల్ని, వస్తువుల్ని ఆన్‌లైన్ ఆర్డర్‌లు చేస్తుంటారు. వ్యవసాయోత్పత్తులను స్థానిక మార్కెట్‌లో అమ్మి డబ్బు వ్యవహారమంతా ఆన్‌లైన్‌లో నడిపిస్తారు. అవినీతికి ఇది చెక్ పెడుతోంది. పింఛన్ల జమ కూడా నేరుగా బ్యాంకు అకౌంట్‌లోకి చేరడంతో ప్రయాణ ఖర్చులు కలిసివస్తున్నాయి. ఇదీ డిజిటల్ గ్రామంగా మారిన అకోదర రోజువారీ సన్నివేశం.

విజయ రహస్యం

నగరాలకు మించి డిజిటల్ సౌకర్యాలను విస్తృతంగా వాడుతోన్న అకోదర విజయం వెనుక చాలా విషయాలున్నాయి. 1200 మంది జనాభా ఉన్న ఈ గ్రామాన్ని ఐసీఐసీఐ బ్యాంకు డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దత్తత తీసుకుంది. అందరికీ బ్యాంకు అకౌంట్లనిచ్చి మొబైల్ సేవల్ని అందిస్తోంది. ఏటీఎం సౌకర్యంతో పాటు విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్లెట్లను ఇచ్చింది. స్థానిక ప్రభుత్వాధికారులు కూడా తమ వంతు సహాయాన్ని అందిస్తూ అంగన్‌వాడీ కేంద్రంలోను, స్కూల్లోనూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు డిజిటల్ సౌకర్యాలను ఎలా వాడాలో ప్రత్యేక శిక్షణ ద్వారా నేర్పించారు. సహాయం కోసం కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇవన్నీ ఫలించింది మాత్రం అత్యధిక అక్షరాస్యులున్న ఆ గ్రామ ప్రజల చైతన్యం, చొరవ వల్లే. ఇవన్నీ అందుబాటులోకి రాక మునుపే చదువు గొప్పదనాన్ని అర్థం చేసుకున్నారు. అహ్మదాబాద్‌కు గంట దూరంలో ఉండటం, గ్రామం సమీపం నుంచే హైవే వెళ్లడం, రహదారి సౌకర్యాలు, నగరాలతో అనుసంధానం ఉండటంతో తేలిగ్గా డిజిటల్ గ్రామీకరణను వంటబట్టించుకున్నారు. అప్పటికే ఆన్‌లైన్ వ్యాపార సేవలు అందుబాటులో ఉండటంతో, వాటిని గ్రామస్తులు చక్కగా వినియోగించడం కలిసివచ్చింది. విద్యుత్, తాగు నీరు వంటి మౌలిక సమస్యలు తక్కువ. ఇవే అకోదర డిజిటల్ గ్రామంగా మారేందుకు సిద్ధం చేశాయి. దీనిలానే మిగతా గ్రామాలు డిజిటల్ హంగుల్ని ఆకళింపు చేసుకోవాలంటే మౌలిక వసతులు, ప్రాథమిక అవసరాలు, విద్యాభివృద్ధి సాధించాల్సిందే. అప్పుడే డిజిటల్ ఇండియా ప్రత్యక్షమవుతుంది. ✦

సినీ గుర్రం

సినిమాల్లో హార్స్ రైడింగ్‌లుంటే అదో స్పెషల్. పౌరాణిక సినిమాల నుంచి పక్కా మోడ్రన్ చిత్రాల్లోను గుర్రాలు కనిపిస్తున్నాయి. సన్నివేశానికి ప్రత్యేక ఆకర్షణ తెస్తున్నాయి. వాటితో విన్యాసాలు చేయిస్తూ సినిమాకు అంకితమైన కుటుంబాలున్నాయి. తమిళ అరసన్ అలాంటి కుటుంబానికి చెందినవాడే.



హీరోలు హుందాగా గుర్రంపై సవారీ చేస్తూ ఎంట్రీ ఇచ్చినా, క్లైమాక్స్ ఫైట్‌లో గుర్రంతో స్టంట్లు చేసినా అభిమానులకు పండగే. మరి ఆ గుర్రాలను షూటింగ్‌లో అన్ని రోజుల పాటు కంటికి రెప్పలా చూసుకుంటూ, అవసరానికి తగ్గట్టు విన్యాసాలు చేయిస్తూ దర్శకుడి భారాన్ని తగ్గించేది వాటి ట్రైనర్లైన యజమానులే. దశాబ్దాల పాటు సినిమా రంగానికే అంకితమై సేవలు అందిస్తున్న వారి కుటుంబాల్లో అరసన్‌ది ఒకటి. తన తండ్రి కుతిరై గోవిందరాజన్ నుంచి ఆ వృత్తిని చేపట్టి ఇప్పుడు తన చిన్న కొడుకుతో మరో తరానికి దాన్ని చేరుస్తున్నాడు. ప్రభుత్వ జంతు సంరక్షణ సంస్థల నియమాలకు అనుగుణంగా వాటిని జాగ్రత్త చూసుకోవడం కీలకమైన విషయం. స్టంట్లలో అవి గాయపడకుండా సన్నివేశాలను పండించడానికి ట్రిక్స్‌ను ఉపయోగిస్తాడట అరసన్. అతడి దగ్గర టుడీల్, నెపోలియన్, టామీ, లక్ష్మీ, గురు అనే తెల్ల గుర్రాలు ఉన్నాయి. ఒకే పోలికలో ఉన్నా అవన్నీ వేర్వేరు వయసులకు చెందినవి. షూటింగుల్లో ఎన్ని గుర్రాల మధ్య ఉంచినా వాటిని అరసన్ స్పష్టంగా గుర్తుపట్టగలడు. హీరోకు ఓ గుర్రం, అతడి తరపున స్టంట్లు చేసే డూప్‌లకు ఒకే పోలికలో ఉన్న గుర్రాలను సమకూరుస్తాడు. తానూ స్టంట్లు చేస్తుంటాడు. అరసన్ శిక్షణనిచ్చిన గుర్రాలు ఎంత తేలిగ్గా కొత్తవారికి మచ్చికవుతాయంటే హీరోలు కోరి మరీ అతడి గుర్రాలనే సినిమాల్లో వాడతారు. కొందరు హీరోల చిత్రాలకు గుర్రం కావాలంటే అరసన్‌కు ఫోన్ వెళ్లిపోతుంది.

సవారీ ఇలా..

అరసన్ సొంతూరు తంజావూర్. అతడి తండ్రి వ్యవసాయం చేస్తుండేవారు. వ్యవసాయంతో పాటే గుర్రాలు, ఆవులు, మేకలు వంటి వాటిని పెంచేవాడు. తొలి గుర్రాన్ని స్థానిక పిండి మిల్లులో పనిచేసేపుడు కొన్నాడు. ఆదాయం సరిపోక చెన్నైకు మారిన గోవిందరాజన్ తన వెంట గుర్రాలను కూడా తీసుకువెళ్లాడు. అక్కడ మెరీన్ బీచ్‌లో వాటిని తిప్పుతుంటే క్రమంగా పర్యాటకులు, స్థానికులు డబ్బులు చెల్లించి సరదాగా వాటిపై వ్యాహ్యాళి చేసేవారు. గుర్రపు బండి కట్టేవాడు. దీన్నే ఆదాయ వనరుగా చేసుకున్న గోవిందరాజన్ తర్వాత సినిమా వాళ్లకు గుర్రాలను అద్దెకు ఇవ్వడం ప్రారంభించాడు. వాటికి రకరకాల విన్యాసాలను నేర్పుతూ ప్రదర్శనలిచ్చేవాడు. సినిమా స్టంట్లకు అనుగుణంగా అవి పనిచేయగలడంతో పూర్తిగా సినిమా రంగానికి మారాడు. అమితాబ్ బచ్చన్ షోలే నుంచి ఎమ్జీఆర్ ఉరిమై కురల్, శివాజీ గణేషన్ చిత్ర పౌర్ణమి వంటి సినిమాలకు పనిచేశాడు. ఆ సినిమాల్లో అతడి గుర్రాలు చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణయ్యాయి. స్టార్లతో పనిచేసిన ఆయన వారికి దగ్గరయ్యాడు. కుదిరై గోవిందరాజన్‌గా మంచి పేరు సంపాదించాడు. 70ల్లో గుర్రాల సన్నివేశాలు సినిమాల్లో ఎక్కువగా ఉండేవి. ఆ మంచి రోజుల తర్వాత క్రమంగా వాటి వాడకం తగ్గిపోయింది. అప్పటి నుంచి కళ్యాణోత్సవాలకు, ఇతర పండుగలకు అద్దెకు ఇచ్చేవాడు. 90ల్లో ప్రత్యేకంగా గుర్రపు బగ్గీ రూపొందించి వ్యాపారంలో పుంజుకున్నాడు. అరుదుగా సినిమా అవకాశాలు వస్తున్నా తన కొడుకును హార్స్ రైడింగ్, స్టంట్లలో శిక్షణనిచ్చి సినిమాకు పనిచేసేలా తయారు చేశాడు. అతడి నుంచి బాధ్యతలు తీసుకున్న అరసన్ మహేష్ బాబు, విజయ్ వంటి సూపర్ స్టార్ల చిత్రాలకు పనిచేశాడు. తెలుగు, తమిళ, హిందీ, మళయాలీ చిత్రాలకు పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఎక్కడ లొకేషన్లలో అక్కడే స్థానికంగా దొరికే గుర్రాలను వాడుతున్నా ముఖ్య సన్నివేశాలుంటే మాత్రం అరసన్ గుర్రాలను పిలవాల్సిందే. రాజస్థాన్, పంజాబ్‌ల్లో నిర్వహించే గుర్రాల సంతలకు వెళ్లి మంచి గుర్రాన్ని ఎంపికచేయడంలో అరసన్ నేర్పరి. రేసులకు కాకుండా స్టంట్లకు ఉత్తమమైన కతియావార్, మార్వారీ జాతుల గుర్రాలనే ఎంపిక చేస్తాడు. ఓ సారి గుర్రం తమ కుటుంబంలో కలిశాక చివరి వరకు తమతోనే ఉంచుకుంటారు. కంటికి రెప్పలా చూసుకుంటూ కుటుంబ సభ్యుడిగా చూస్తారు. ముప్పై ఏళ్లకు పైగా తమతో ఉంటున్న గుర్రాలు ఆయన వద్ద ఉన్నాయి. అవి వ్యాపార అవసరాలకు పనికిరాకున్నా మిగతా వాటిలానే చూసుకుంటారు. ఐదు పదుల వయసు నిండటంతో అరసన్ తర్వాతి తరాన్ని తయారుచేసే పనిలో ఉన్నాడు. తన చిన్న కొడుకు సంతోష్‌కు ఈ వృత్తిలో మెళకువలు నేర్పుతున్నాడు. తనతోపాటు షూటింగులకు తీసుకెళుతూ ప్రాక్టికల్‌గా శిక్షణ నిస్తున్నాడు. ప్రస్తుతం తమిళ సూపర్ స్టార్ విజయ్ తాజా సినిమా పులికి పనిచేసిన ఆయన కొన్ని స్టంట్లను దగ్గరగా సంతోష్‌కు చూపించి తమ వృత్తి గొప్పదనం అర్థమయ్యేలా చేశాడు.

✦

మనిషి కనపడని చోటు

వింత వింత అనుభవ వాహిని
విదేశీ దృశ్య సమాహారం
రోడ్డుపై నిల్చి వీక్షిస్తున్నాను
చుట్టూ చెట్లు అటూ ఇటూ కొండలు కొలనులు
మేఘాలు అటూ ఇటూ పరుగెడుతూ
ఏదో అత్యవసర సేవలో నిమగ్నమయ్యాయి
తెల్లని మాసికల్తో
నీలిరంగు చీర గట్టిన ఆకాశం
కడు బీదగా ఉంది
సగం పగిలిన మూకుడు
ఆకాశానికి అంటుకుని వుంది
మేఘమాలికా చంద్రబింబమా
చూపు పసిగట్టటం లేదు
ఒక్క మనిషి ఒకే ఒక్క మనిషి
కను చూపుకు అందటం లేదు!
నల్ల పూసల దండల్లో కార్లు
మధ్య మధ్య ఎర్రెర్రని తెలతెల్లని పూసలు
గంటలు గడిచి పూటగా మారుతూంది కాలం
వంద మందికి పంచాల్సిన చలి నా ఒక్కణ్ణి
ఉక్కిరి బిక్కిరి చేస్తూ చుట్టు ముట్టింది
ఒక్కడు ఒకే ఒక్కడు
నా చూపుకు కరువయ్యాడు
నా తలను అంపశయ్య చేసుకుందేమో
చెట్టు గలగలా ఆకుల్ని దాల్చింది!
రోడ్డుపై నడక సాగుతుంది
వేగంగా దూసుకొచ్చిన పక్షి
నా చుట్టూ గిరికీలు కొట్టి ఎగిరిపోయింది
కాలవలో కదిలిపోతూ చేప పిల్ల
నన్ను చూసి నవ్వింది
మనిషిని చూడ్డం యిదే మొదలు కాబోలు
ముంగిట వాలిన సీతాకోక చిలక
పంచ రంగుల చీరను చూడమంది
ముని వేళ్ళతో పట్టి ముద్దును అద్ది వదిలాను
నాలో పంచ భూతాలు పాడుతున్నాయి
దృష్టి ఆకాశాన్ని ఆక్రమించింది
కష్టించిన మేఘాలు
భోజన విరామ గూట్లోకి వెళ్ళాయి
సగం పగిలిన మూకుడు చంద్రాకారమే!
అలసట ఇంటికి చేర్చింది
పాదచారిగా తిరిగినందుకు ఇల్లంతా
కలవరం వణికింది
దిగుల్లో మునిగింది
నడవొద్దంటూ వొట్టు వేయించుకుంది.

**(వందల కిలోమీటర్లు ప్రయాణించినా
మనిషి కనపడని ఆస్ట్రేలియా సందర్శించాక)**

నిండు ఆకాశం

భీకర యుద్ధం
శత్రువు విజృంభణ
ఎదురు దాడిలో
శక్తి యుక్తుల ప్రయోగం
దేశ రక్షణలో
ప్రాణం పణం పెట్టి
శత్రువును చెండాడిన
సైనికుడు
విజయ పరంపరలో
అతనింకా ఇంటికి రాలేదు
ఆమె ఎదురు చూస్తూ ఉంది!
ప్రబలిన అంటు వ్యాధి
అంకిత జీవితం
మరణానికి దగ్గరైన వారిని
మరింత దూరం చేస్తూ
వ్యాధిని వెంటాడి
ఆరోగ్య పరిరక్షణలో
అతనింకా ఇంటికి రాలేదు!
ఆమె ఎదురు చూస్తూ ఉంది!
పూర్తి గాని సిలబస్
పై బడుతున్న పరీక్షలు
విషయ సేకరణలో
గ్రంథాలయ శోధనలు
అధ్యాపకుడి
అకుంఠిత దీక్ష
గురువును మించిన
శిష్యుల తయారీలో
అతనింకా ఇంటికి రాలేదు!
ఆమె ఎదురు చూస్తూ ఉంది!
నో వేకన్సీ బోర్డుల వెంట
ఎక్కిన మెట్లు
దిగిన మెట్లు లెక్కిస్తూ
ఇంటర్వ్యూ గట్టెక్కినా
చేతికందని ఉద్యోగం
నలిగిన డిగ్రీతో
అరిగిన కాళ్ళతో
అతనింకా ఇంటికి రాలేదు
ఆమె ఎదురు చూస్తూ ఉంది!
ఆమె సగం
అతను సగం
సగం సగం
నిండు ఆకాశం

- అడిగోపుల వెంకట రత్నమ్

బ్యాంకాక్ ఒక్కసారైనా చూడాల్సిందే

అదో అందాల రాజధాని నగరం. సుందర వీధులతో, సమున్నత సౌధాలతో, అసంఖ్యాకమైన కార్లతో, విలాసవంతమైన హోటళ్లు, బార్లతో శోభిల్లుతూ వుంటుంది. నియాన్ దీపాల కాంతితో వెలిగిపోతూ వుంటుంది. సందడిగా వుండే వీడియో పార్లర్లతో, కంప్యూటర్ జోతిష్కులతో హడావిడిగా కనిపిస్తుంది. ప్రపంచంలోని పెద్ద పట్టణాలైన లండన్, న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్‌లకు ఏ విధంగానూ తీసిపోదు. అంతేనా! కొన్ని విషయాలలో వాటిని మించిపోయే ఆ సుందర నగరం మరేదో కాదు. బ్యాంకాక్.

వాట్ పో ఆలయం

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌ని సందర్శించడం ఒక అపూర్వమైన అనుభూతే అని చెప్పుకోవచ్చు. ఓ వైపు బుద్ధ భగవానుని ప్రవచనాలు మారుమోగిపోతూ వుంటే, మరోవైపు ఆధునిక నాగరికత అందిస్తున్న అపారమైన భోగలాలసతను ప్రతిబింబించే నైట్‌క్లబ్బులు, డిస్కో పార్లర్లు, మసాజ్ సెంటర్లు, బార్లు జోరుగా వ్యాపారం చేస్తూ వుంటాయి. బ్యాంకాక్ బజార్లలో దొరకని వస్తువు వుండదు. ఆఖరికి పులిపిల్లల్ని, సింహపు కూనల్ని అమ్మే డిపార్టుమెంట్ స్టోర్ కూడా వుంది.

వీధులు విశాలంగావున్నా వందల కొద్దీ కార్లు, ట్రక్కులు ఇతర వాహనాల వల్ల ట్రాఫిక్ జామ్‌లు మామూలే. ఈ రద్దీ మధ్య మెయిన్ బజార్ మధ్యలో వున్న ఆలయంలో పద్మాసనం వేసుకుని కూర్చున్న బుద్ధ భగవానుడు వుంటాడు. ధవళకాంతులీనుతూ, 30 అడుగుల ఎత్తున్న ఈ రత్నఖచిత బుద్ధవిగ్రహాన్ని ఒకటో రామరాజు ప్రతిష్ఠించాడు. 210 సంవత్సరాల క్రితం ఒకటో రామరాజు బ్యాంకాక్‌కు థాయ్‌లాండ్ రాజధాని గౌరవాన్ని కల్పించిన సందర్భంలో ఈ బుద్ధవిగ్రహ ప్రతిష్టాపన జరిగింది.

ఆలయాల నిలయం

బ్యాంకాక్‌ను ఆలయాల నిలయంగా అభివర్ణించవచ్చు. ఈ నగరంలో 400కు పైగా దేవాలయాలున్నాయి. వీటిలో బౌద్ధాలయాలే ఎక్కువని వేరే చెప్పనక్కరలేదు.కాలువలతో, నదులతో చక్కని వాతావరణంతో సదా ఆహ్లాదకరంగా ఉంటు ందీ నగరం. తెల్లవారటం ఆలస్యం, నగ రంలోని వేలా దిమంది బౌద్ధసన్యాసులు మంత్రోచ్చారణ చేస్తూ నగర సందర్శనం ప్రారంభిస్తారు.

ఈనాడు ఇంతగా అభివృద్ధి చెందిన బ్యాంకాక్ 200 సంవత్సరాల క్రితం ఒక చిన్న గ్రామం. ఎక్కువగా జాలరులే నివశించిన చిన్న ఊరు. ఈనాడు బ్యాంకాక్‌కు రోజూ వేలాదిమంది ప్రజలు పొరుగూళ్లనుండి, పొరుగు దేశాల నుండి కూడా వచ్చిపోతూ వుంటారు. రైళ్లు, కార్లు, విమానాలు ఆఖరికి నౌకలలో కూడా వచ్చి బ్యాంకాక్ గడ్డమీద పాదం మోపుతుంటారు. ఒకసారి బ్యాంకాక్‌లో అడుగు పెట్టినవారిని ఈ నగరం ఇట్టే ఆకర్షిస్తుంది. ఈ ఊళ్లోనే సెటిలైపోదామా అన్న ఆలోచనను కూడా కలిగిస్తుంది. ఇటువంటి ఆలోచనలతోటే జపాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్ వంటి దేశాల నుండి వచ్చిన అనేక మంది బ్యాంకాక్‌లో స్థిరనివాసాలు ఏర్పరుచుకుని అక్కడి జనాభాను ఇతోధికంగా పెంచేస్తున్నారు.

విచిత్ర నగరం

గ్రాండ్ ప్యాలెస్‌లోని విగ్రహం

బ్యాంకాక్ చాలా చిత్రమైన నగరం. ఎంతో అందంగా తీరుగా కనిపిస్తుంది. కాని అంతా గజిబిజిగాను, అయోమయంగాను కూడా తోస్తుంది. పాశ్చాత్య నాగరికతా ప్రభావం ఒకవైపు కనిపిస్తూ వుంటుంది. మరోవైపు సాంప్రదాయ సిద్ధమైన బౌద్ధమత విశ్వాసాలను ప్రతిబి ంబించే వాతావరణం వెల్లివిరుస్తూ వుంటుంది. ఈనాడు ప్రతి పదిమంది థాయ్ ప్రజల్లో ఒకరు బ్యాంకాక్‌లో నివసిస్తున్నారు. థాయ్‌లాండ్‌లో వున్న వాహనాలలో 90 శాతం బ్యాంకాక్ వీధుల్లోనే వరుగులు తీస్తూ వుంటాయి. లక్షలాది కార్లు, బస్సులు, ట్రక్కులు, మోటారు సైకిళ్లు చేసే రణగొణధ్వనుల వల్ల బ్యాంకాక్ పౌరులకు కోరకుండానే బధిరత్వం సంక్రమిస్తోందట.

అసలు పూర్వపు బ్యాంకాక్‌ను చుడుతూ ఛావో ఫ్యానది ప్రవహిస్తూ వుంటుంది. ఈ నదీ జల పరిష్వంగంలో మామిడికాయ ఆకారంలో మిగిలిన భూభాగమే వెనకటి బ్యాంకాక్ నగరం. దరిమిలా ఈ ఊరు నదికి ఇవతలవైపు కూడా తన పరిధిని పెంచుకుని ఈనాటి సువిశాలమైన బ్యాంకాక్‌గా రూపుదిద్దుకుంది.

తొలి దర్శనం

లాక్ మువాంగ్ స్తంభం

బుద్ధదేవుని దేవళానికి వెళ్లకముందే మరో చిన్న మందిరం కనిపిస్తుంది. ఈ రాతి స్థంభాన్ని లాక్ మువాంగ్ స్థంభం వుంది. సంగీతం, నృత్యం వగైరా లలితకళలను అభ్యసించినవారు తమ తొలి ప్రదర్శనను ఈ మందిరలోనే నిర్వహిస్తుంటారు. బ్యాంకాక్‌ను సందర్శించే వారు ముందుగా ఈ మందిరాన్నే దర్శించడం అలవాటు. తమ బ్యాంకాక్ పర్యటన సజావుగా సాగాలని కోరుకుంటూ లాక్‌మువాంగ్‌ను దర్శించి పువ్వులతో పూజలు చేస్తుంటారు. బ్యాంకాక్‌లో ముఖ్యంగా చూడదగ్గది వాట్‌ఫ్రాక్వుయొ దేవాలయం. ఈ ఆలయంలోనే రత్న ఖచిత బుద్ధవిగ్రహం వుంది. రాజమందిరమైన గ్రాండ్ ప్యాలెస్‌కు దగ్గరగానే ఈ దేవాలయం వుంది. ఏ శుభసందర్భంలోనైనా థాయ్‌లాండ్ రాజులు ముందుగా ఈ బుద్ధదేవుని అర్చించే మరీ కార్యోన్ముఖులు కావడం అనాదిగా వస్తున్న ఆచారమే. ఈ ఆలయ ప్రాంగణంలో అనేక చిన్న చిన్న మందిరాలున్నాయి. దేవాలయ ప్రహరీ గోడ యావత్తూ సుందరమైన చిత్రాలతో శోభిల్లుతూ వుంటుంది. "రామ్‌కిన్" అని థాయ్‌లాండ్ వాసులు చెప్పుకునే రామాయణ కథ తాలూకు చిత్రాలు ఆ గోడలపై చిత్రించి వున్నాయి. థాయ్‌లాండ్ రామాయణం థాయ్ ప్రజలు ఎంతో మక్కువ చూపే ఇతిహాసం. బ్యాంకాక్‌లోకెల్లా అతి పురాతనమైన దేవాలయం పేరు వాట్‌పో. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో విస్తరించుకునివున్న ఈ సువిశాలమైన దేవాలయాన్ని రెండు భాగాలుగా విభజించారు. ఒక భాగంలో మతపరమైన మందిరాలు బారులు తీరి వుండగా రెండో భాగంలో బౌద్ధ సన్యాసుల నివాస మందిరాలు వుంటాయి. రెండు భాగాలను వేరు చేస్తూ జెటోపిన్ రోడ్ అనే చిన్న సందు వుంది. వాట్‌పో ఆలయానికి 16 గేట్లున్నాయి. అయితే సందర్శకులను రెండు గేట్లలో నుంచి మాత్రమే వెళ్లడానికి అనుమతిస్తారు. వాట్‌పో ఆలయంలో అనేక స్థూపాలు చూడచక్కని ఎన్నో ప్రతిమలు వున్నాయి. ఈ దేవాలయాన్ని సందర్శించడం ఒక విధంగా ఒక విద్యాలయాన్ని దర్శించడంగానే థాయ్‌లాండ్ ప్రజలు భావిస్తూ వుంటారు. ఈ ఆలయాన్ని దర్శించి అక్కడి విశేషాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా ఎంతో విజ్ఞానం వంటపడుతుందని అక్కడి వారు భావిస్తారు. అందుకే ప్రజలు ఈ ఆలయాన్ని "థాయ్‌లాండ్ తొలి విశ్వవిద్యాలయం" గా చెప్పుకుంటూ ఉంటారు. ఇక్కడి బుద్ధుడి విగ్రహం తప్పక దర్శించాల్సిందే. ఆరు మీటర్ల పొడవు, 15 మీటర్ల ఎత్తు వుంటుంది. పైగా విగ్రహానికి వేసిన పుత్తడి పూత సందర్శకులను కళ్లు తిప్పుకోనివ్వదు.

బ్యాంకాక్ నదిలో మార్కెట్

రాజప్రాసాదం

బ్యాంకాక్ వెళ్లినవాళ్లు రాజ ప్రాసాదం చూడకుండా ఎలాగూ రారు. రాజసౌధం, గ్రాండ్ ప్యాలెస్‌ను చూడడానికి సందర్శకులను అనుమతిస్తారు. అయితే రాజ భవనం చూడాలనుకున్నా యాత్రికులు నిర్ణీతమైన దుస్తులు ధరించాలి. ఈ భవన సముదాయంలో రాజుగారు ఉండే సౌధాన్ని చక్రి మహాప్రసాద్ అంటారు. చక్రి మహాప్రసాద్‌లోని రెండు రిసెప్షన్ గదులను మాత్రమే సందర్శకులను చూడనిస్తారు. అక్కడికి అదే మహాభ్యాగమని చెప్పవచ్చు. ఈ గదులలో వున్న చిత్రమైన శిల్పాలు, అపూర్వమైన వర్ణ చిత్రాలు, గోడలకు వేలాడుతున్న అద్భుతమైన ఆయుధాలు వగైరా చారిత్రక ప్రాధాన్యత గల ఎన్నో కళా ఖండాలు సందర్శకును ఎంతగానో అలరిస్తాయి. చక్రి మహాప్రసాద్ ఎడమవైపున వున్న ద్వారాం గుండా వెళ్తే అంత:పురం వస్తుంది. థాయ్ రాణులు నివాసం అది. రాణివాసాన్ని చూడడానికి సందర్శకులను అనుమతించరు.

గ్రాండ్‌ప్యాలెస్‌లో చక్రి రాజ వంశస్తులు సేకరించిన ఆయుధాలను, ముద్రించిన వివిధ నాణేలను ప్రదర్శించే ప్రదర్శన శాలలు వున్నాయి. ఎక్కడనుండో సేకరించిన అపూర్వమైన శిల్పాలు, సౌధ సముదాయ ఆవరణలో విస్తరించికొని వున్న తోటలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయి.

లలిత కళలను నేర్పే శిలావకారన్ యూనివర్శిటీ, ఆ పక్కనే వున్న నేషనల్ లైబ్రరీ, ఆర్కియలాజికల్ మ్యూజియం వగైరాలన్నీ యాత్రికులు అవశ్యం చూడద గ్గవే. రక రకాల జంతువులతో నిండివున్న డ్యూసిట్ జూ కూడా ఒక ప్రత్యేకమైన ఆకర్షణే. ఈ జూలో జంతువులే కాక చిత్ర విచిత్రమైన పక్షులు, మొసళ్ల వంటి జల చరాలు కూడా వున్నాయి. ఇన్ని విశేషాలు గల సుందరతీరమైన బాంకాక్ నగరాన్ని సందర్శించినవారు, నగర సౌందర్యానికి ముగ్ధులవడమే కాక వెళ్లి రావోయి ఒక సారి బ్యాంకాక్ అంటూ మిత్రులకు సిఫార్సు చేయకుండా వుండలేరు. ●

గ్రాండ్ పాలెస్ లోపలి బుద్ధ విగ్రహాలు

కళంకిత కమలం

'అ...అమ్మ, ఆ...ఆవు' అని చెప్పకునే రోజులు పోయాయి. 'అ...అవినీతి, ఆ...ఆశ్రిత పక్షపాతం' అనుకోవాల్సిన కాలం వచ్చేసింది. మాది భిన్నమైన పార్టీ. స్వచ్ఛమైన పార్టీ అంటూ జనాన్ని నమ్మించి మరీ గద్దెనెక్కిన బి.జె.పి వారూ తక్కువ తినలేదని నిరూపితమౌతోంది. మోడీ గేట్, వ్యాపమ్ స్కామ్, చిక్కీ కుంభకోణం, అగ్నిమాపకాల కొనుగోళ్ల స్కామ్ ఓ వైపు, నకిలీ సర్టిఫికెట్లు- అక్రమ చదువుల ఆరోపణలు మరోవైపు కమలనాథులకు పట్టపగలే చుక్కలు చూయిస్తున్నాయి. స్కాముల్లో చిక్కి మత దురభిమానానికి తోడు అవినీతి ఆభరణాన్నీ అలంకరించుకొని కళంకితగా మన ముందు నిలబడిన భాజాపా స్కాముల లీలా విలాసం ఏ స్థాయిలో వుందో ఈ వారం అట్టమీది కథలో చూద్దాం.

- కె. అంజన

ఏడాది కిందట కేంద్రంలో గద్దెనెక్కింది భారతీయ జనతా పార్టీ (బి.జె.పి). గత పార్టీలకు తమకు నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుందని ఊదరగొట్టేసింది. అసలు అవినీతికి స్పెల్లింగే తెలీదన్నట్టు అదరగొట్టేసింది. నల్లధనం వెలికితీత, పారదర్శకత, జవాబుదారీ తనం గురించి ఆకాశమే హద్దుగా బడాయి బాకాలు ఊదుతుండగానే... ఏడాది పాలన పూర్తయింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఘనంగా ఉత్సవం జరుపుకున్న పదిరోజులకే ఒకదాని తర్వాత ఒకటిగా స్కాముల పుట్టలు పగిలి అవినీతి పాములు బైటికొచ్చి జనాన్ని విస్మయ పరిచాయి. భయ పెట్టాయి. సుష్మా స్వరాజ్, వసుంధర రాజే, శివరాజ్ సింగ్ చౌహాన్ వంటి కమలం పార్టీ సీనియర్ నేతలే కాదు. పంకజా ముండే, వినోద్ తావ్డే వంటి యువ లీడర్లూ కవల పిల్లల్లాంటి అవినీతిలో, ఆశ్రిత పక్షపాతంలో బాగా చెయ్యి తిరిగిన వారేనని నిరూపించారు.

మోడీ గేట్

ఈ మధ్య కాలంలో పత్రికల్లోనూ, టీవీల్లోనూ లలిత్ నామ జపం వినిపించని రోజు లేదు. ఐ.పి.ఎల్ బాస్‌గా ఒక వెలుగు వెలిగిన ఈ నేరగాడు అధికారంలో వున్న పెద్దలందరికీ సన్నిహితుడు. పార్టీలకు అతీతంగా పనులు చేయించుకోగల సమర్థుడు. విదేశీ మారక చట్టం ఉల్లంఘన, ఐపిఎల్ బెట్టింగ్, నిధుల దుర్వినియోగం, ప్రత్యక్ష ప్రసారాల హక్కుల్లో అవకతవకలు వంటి అనేకానేక అభియోగాలతో మోస్ట్ వాంటెడ్ పర్సన్‌గా దేశం దాటిపోయిన కేటుగాడు.

దాదాపు 1700 కోట్ల రూపాయల అవకతవకలకు కేంద్రబిందువైన ఆర్థిక నేరస్థుడు. అలాంటి వాడికి కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే సాయం చేయడం చిన్న విషయం కాదు. కాకపోతే అందుకు వారు

సుష్మా స్వరాజ్

లలిత్ మోడీ

వసుంధర రాజె

చెప్తున్న కారణాలు, చేసిన సహాయాలే వింతగానూ, విపరీతంగానూ వుంటాయి.

సుష్మా 'మానవీయ కోణం' సూపర్!

లలిత్ మోడీ అనే నేరస్థుడు దర్యాప్తులను తప్పించుకోవడానికి లండన్ పారిపోయిన మోస గాడు. పోర్చుగల్‌లో ఆయన భార్యకు క్యాన్సర్ చికిత్స చేస్తున్నందున జాలిపడి జస్ట్ అతను అక్కడికి వెళ్లేందుకు సాయం చేశారట సుష్మా మేడమ్. అంతకు మించి అతనికి తనకు ఎలాంటి లావాదేవీలు లేవట. కేవలం మానవీయ కోణంలోనే దీన్ని చూడాలట. నైతిక విలువల ఉల్లంఘన వంటి పెద్ద పెద్ద విషయాలను పట్టించుకోకూడదట. ఇదంతా చదువుతుంటే మన మనసులూ మెత్తబడే అవకాశం వుంది. అసలు విషయం తెలిస్తే మాత్రం ఆమె మీద పట్టరాని ఆగ్రహం కలిగినా ఆశ్చర్యం లేదు. సుష్మా భర్త స్వరాజ్ కౌశల్ దాదాపు రెండు దశాబ్దాలుగా లలిత్ మోడీ లాయర్. ఆయన దగ్గర ఫీజు తీసుకుంటూ వెన్నంటి నడిచిన వాడు. అతని లావాదేవీల కోసం కోర్టుల్లో వాదించినవాడు. ఇహ సుష్మ, స్వరాజ్ కుమార్తె బాన్సురి కూడా న్యాయవాదే. లలిత్ పాస్‌పోర్టు రద్దయిన దగ్గర నుంచి 2014 ఆగస్టు వరకు ఢిల్లీ హైకోర్టులో పోరాడి మరీ పాస్‌పోర్టును పునరుద్ధరింపచేసిన లాయర్. సుష్మాజీ ఇన్ని మతలబులను విడిచిపెట్టి కేవలం మానవీయ కోణంతోనే లలిత్‌కు సాయం చేశాననడం కరెక్టు కాదు కదా.

లమో- రాజే స్నేహ గీతం

లలిత్ బ్రిటన్ పారిపోవడానికి సాయం చేసిన మరొక ప్రముఖురాలు వసుంధర రాజే. ఈమె మొదటిసారి రాజస్థాన్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు లలిత్ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగాడు. షాడో సీఎంగా పెత్తనం చెలాయించాడు. అందుకు కారణం లేకపోలేదు. వసుంధర తల్లిదండ్రులకు లలిత్ పెద్దలకు గట్టి మైత్రీ బంధం వుంది. అదే వీరి మధ్యా ప్రతిబింబించింది. లలిత్ మోడీ వీసా కోసం రాజే బ్రిటన్ ప్రభుత్వానికి లేఖ రాయడమే కాదు... అతని భార్యకు అండగా వుండేందుకు పోర్చుగల్ సైతం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వచ్చాక లలిత్ భార్యకు వైద్యం చేసిన పోర్చుగల్ ఆసుపత్రి వారికి రాజస్థాన్‌లో హాస్పటల్ కట్టుకోవడానికి స్థలం కూడా కేటాయించారు. ఇవన్నీ కేవలం స్నేహం కోసమే అంటారామె. కాకపోతే క్విడ్ ప్రో కో లేకపోలేదు. రాజె కుమారుడు దుష్యంత్ సింగ్‌కు చెందిన ఓ హోటల్ వ్యాపారంలో 11 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాడు లలిత్. అదీ కేవలం పది రూపాయల విలువ చేసే ఒక్కో షేరును ఏకంగా 96,200 రూపాయలకు కొనిపారేశారు ఉదారంగా. ఇదిలా వుండగా ప్రభుత్వ అధీనంలో వున్న ధోల్‌పూర్ ప్యాలెస్‌ను స్వాహా చేయడంలో, ప్రయివేటు హోటల్‌గా మార్చడంలో, దాని నిర్వహణలో లలిత్, దుష్యంత్ ఇద్దరికీ భాగస్వామ్యం వుంది. రాజే ఇవన్నీ దాచిపెట్టి నాకేం తెలీదు. నంగనాచినంటే జనం నమ్ముతారా?!

వ్యాపమ్'...రియల్ హారర్ మూవీ!

భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఏ హాలీవుడ్ హారర్ మూవీ అయినా సరే! వ్యాపమ్ ముందు బలాదూరే! ఒళ్లు గగుర్పొడిచే హత్యలు, అంతకంతకు పెరుగుతున్న మృతుల సంఖ్యతో ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో తెలీనంత ఉత్కంఠభరితంగా, భయానకంగా సా...గుతోందీ బహిరంగ మానవ హననం. ఇప్పటి వరకు మనం చూసిన కుంభకోణాలు వేరు. వ్యాపమ్ వేరు. వాటన్నిటికీ లేనిదీ, దీనికి అదనంగా వున్నదీ అమాయకుల రక్త తర్పణం. మధ్య ప్రదేశ్‌లోని మారు మూల పల్లెల్లో సైతం దీని బాధితులున్నారు. 'వ్యాపమ్' పూర్తి నామం 'వ్యావసాయక్ పరీక్షా మండల్'. ఉద్యోగ నియామకాలు, ప్రవేశాల కుంభకోణం. 'ఎలాగైనా సరే' ఒక్కటంటే ఒక్క ప్రభుత్వోద్యోగం సంపాదించి బతుక్కి ఓ భరోసా కల్పించుకోవాలని ఆశపడే సామాన్యులు... వారి ఆశలను ఆసరా చేసుకుని లాభపడాలనుకొనే అధికారులు... వారితో చేతులు కలిపి అడ్డ దారులు తొక్కిన ఏలికలు ... కలిస్తేనే వ్యాపమ్. మొత్తం మీద వ్యవస్థీకృతమైన అవినీతికి నిలువెత్తు రూపం ఈ కుంభకోణం. ప్రయివేటు పెట్టుబడులు, పారిశ్రామికీకరణ నామమాత్రంగా వున్న రాష్ట్రంలో సామాన్యులకు ఏ సమస్య వచ్చినా, ఏ సాయం కావాలన్నా ప్రభుత్వం వైపే చూడాలి. అలాంటి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగం కోసం సహజంగానే యువత ఎదురు చూస్తుంది. వారి



శివరాజ్ సింగ్ చౌహాన్

స్మృతి ఇరానీ

ఆరాటాన్ని సొమ్ము చేసుకోడానికి జిల్లా స్థాయి అధికారులు లేశమాత్రం వెనుకాడలేదు. అర్హత లేనివారికి మెడికల్ కాలేజీల్లో సీట్లు ఇచ్చేశారు ఉదారంగా. కానిస్టేబుల్, టీచర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ తదితర ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లోనూ నిబంధనలకు నీళ్లొదిలారు. ఒకరి తరపున వేరొకరు పరీక్ష రాసినా అభ్యంతర పెట్టలేదు. అభ్యర్థికి అనుకూలంగా వుండేలా పరీక్షల్లో సీట్లు మార్చడానికీ, ఒఎంఆర్ షీట్లు మార్చడానికీ వెనుకాడలేదు. 2008-13 మధ్య కాలంలో వెయ్యి మందికి పైగా అనర్హులు వైద్య కళాశాలల్లో చేరారు. అంటే అంతమంది అర్హులకు అన్యాయం జరిగిందన్నమాట.

ఎప్పటి నుంచో ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరుగుతున్నా 2003లో బి.జె.పి అధికారంలోకి వచ్చాక ఈ అక్రమ వ్యవహారాలు భారీ ఎత్తున జరిగి దేశం దాటి ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఆ తర్వాత రెండేళ్లకి గద్దెనెక్కిన శివరాజ్ సింగ్ చౌహాన్ అప్పటి నుంచి సీఎంగా కొనసాగుతున్నారు. అక్కడి అక్రమాలకు సంబంధించి వెలువడుతున్న వార్తలు, వాస్తవాలు చూస్తుంటే ఇది ఒక కుంభకోణం కానే కాదు. అనేకానేక స్కాముల పుట్ట. సమస్యల గుట్ట అనిపిస్తోంది. వ్యాపమ్ ద్వారా అర్హత లేకుండానే కాలేజీల్లో సీట్లు సంపాదించుకున్నవారు, వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన వారు, ఇచ్చిన వారు, ఈ అవినీతి పుట్టలను తవ్వి వార్తలు రాస్తున్న విలేకరులు .. వరుసగా ఒకరి తర్వాత ఒకరు చనిపోవడం చూస్తూనే వున్నాం. వీరిలో మద్యం తాగి చనిపోయేవారు, రోడ్డు మీద నడుస్తుండగా భారీ వాహనం గుద్దడంతో ప్రాణాలు విడిచేవారు, లాడ్జీల్లో-హోటళ్లలో విడిది చేసినవారు చేసినట్టే విగతజీవులయ్యేవారు, రైల్వే పట్టాల పక్కన... నీటి గుంతల్లో శవాలై తేలేవారు ... ఎందరో! ఈ మృతుల్లో గవర్నర్ కుమారుడు కూడా వుండడం సమస్య తీవ్రతను తెలుపుతుంది. అధికారిక లెక్కల ప్రకారం ఇలా చనిపోయింది పాతికమందే. కానీ ఆత్మహత్య లుగానో, దుర్ఘటనలుగానో చిత్రించ బడుతున్న ఈ మృతులు యాభై వరకు వుండొచ్చని పత్రికల కథనం.

ఈ కుంభకోణంలో ముద్దాయిలుగా వున్న దాదాపు 2500 మందిలో ఏ ఒక్కరూ ఆర్థిక నేరగాళ్లు కారు. ఏదో చిన్నా చితకా ఉద్యోగం సంపాదించుకోవాలని ఆశపడినవారే. వీరిలో 800 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో మంత్రులకు సన్నిహితులు, గవర్నర్ రామ్ నరేశ్ యాదవ్ కుమారుడు శైలేశ్ యాదవ్, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా వున్నారు. ఆఖరికి రాష్ట్ర గవర్నర్ ఈ కుంభకోణంలో పదవ నిందితుడిగా వుండడాన్ని బట్టి ఈ స్కాము వేళ్లు ఎంత లోతుగా విస్తరించాయో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగు తున్నా... స్కామలు, వాటి మూల విరాట్టుల గురించి ముఖ్యమంత్రి చౌహాన్ గారికి తెలీదంటే నమ్మలేం. ఆయన బంధువర్గానికి, కుటుంబానికి ఇందులో ప్రమేయం వుందో లేదో! లేదని మాత్రం తెగేసి చెప్పలేం. వుంటే ఎప్పటికైనా బైటపడక మానదు. ఎందుకంటే తప్పుని ఎక్కువ కాలం కప్పిపుచ్చ లేం. పైగా ఇన్ని చావుల తర్వాత ఇది సామాన్యమైన స్కామ్‌గా భావించలేం. అధికారంలో వున్న పెద్దల తలకాయలు వున్నందునే వారి పేర్లు బైటికి రాకుండా వ్యాపమ్‌తో సంబంధం వున్న వారిని పైకి పంపిస్తు న్నారన్నది అందరికీ వినిపించే అజ్ఞాత స్వరం.

మనకు స్కాములు కొత్త కాదు. కుంభకోణాలు తెలియనివి కాదు. స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో జరిగిన స్కాముల్లో అతి పెద్దది 2జి. సెన్సేషన్ సృష్టించిన స్కామ్ కూడా అదే. అంతకు మించిన కుంభకోణం వ్యాపమ్. ఇప్పటికే దీనికి సంబంధించి మంత్రి ఒకరు జైల్లో వున్నారు. ఉన్నతాధికారుల ప్రమేయంపై దర్యాప్తు జరుగుతోంది. ప్రతిపక్షాల గగ్గోలు పెడుతుంటే భరించలేక కేసును సి.బి.ఐకి అప్పగించమనడంతోనే ముఖ్యమంత్రి చౌహాన్ తనను తాను నిష్కళంకితుడిగా చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ దర్యాప్తులు జరిగాక కదా తెలిసేది. ఎవరెవరి పాత్ర ఏమిటో? ఎవరెవరు ఎంత బొక్కారో? బైటపడేది. అన్నట్టు వ్యాపమ్ సొమ్ముతో బి.జె.పి ,ఆర్ఎస్ఎస్ నేతలు విమానాల్లో షికార్లు చేశారన్నది తాజాగా వెలుగులోకి వచ్చిన వాస్తవం.

అబద్ధాల చదువులు

సాదా సీదా జనం అబద్ధాలు చెప్పారంటే... తిండికి లేకో, తాత్కాలిక ప్రయోజనాల కోసమో కక్కుర్తి పడ్డారనుకోవచ్చు. కానీ కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర మంత్రులుగా గౌరవనీయమైన పదవుల్లో వున్న వారే తమ చదువుల గురించి అబద్ధాలు చెప్తే! పలు సందర్భాల్లో రకరకాల చదువులను పేర్కొంటే! నకిలీ సర్టిఫికెట్లతో ఇటు ప్రజలను, అటు రాజ్యాంగాన్ని మోసం చేస్తుంటే! ఏ మాత్రం ఉపేక్షించకుండా బుద్ధి చెప్పాల్సిందే! నరేంద్రమోడీ గారి మంత్రివర్గంలో అత్యంత పిన్న వయస్కురాలిగా వెలుగొందుతున్న మానవ వనరుల శాఖామంత్రి, టీవీ నటి స్మృతి ఇరానీ అదే పని చేశారు. 2004 ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు సమర్పించిన అఫిడవిట్‌లో దూర విద్య ద్వారా ఢిల్లీ యూనివర్సిటీ నుంచి (1996లో) ఆర్ట్స్ డిగ్రీ చేసినట్టు పేర్కొన్నారు. 2014 సాధారణ ఎన్నికలప్పుడు అదే యూనివర్సిటీ నుంచి (అదే సంవత్సరం) కామర్స్ డిగ్రీ చేసినట్టు అఫిడవిట్‌లో రాసిచ్చారు. ఒకే సంవత్సరం రెండు రకాల డిగ్రీల ను ఎలా చేశారనేది మినిస్టర్ మేడమ్ సెలవివ్వాలి.

మహారాష్ట్రలో ఏకంగా విద్యాశాఖా మంత్రిగారే నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణల్లో కూరుకుపోయారు. బి.జె.పి ప్రభుత్వంలో మంత్రిగా వున్న వినోద్ తావ్డే ఊరూ పేరు లేని విద్యా సంస్థలో ఇంజనీరింగ్ చదివారట. పైసలిస్తే చాలు. కోరుకున్న డిగ్రీ పట్టా ఇచ్చే నకిలీ విద్యాలయాలకేం కొదవ లేదు. అలాంటి యూనివర్సిటీ నుంచి డిగ్రీ సంపాదించిన ఈయన గారు పాఠశాల, ఉన్నత విద్యనభ్యసించే భావి భారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దే విద్యా విధానాలను రూపొందిస్తారట.

బీహార్‌లో బీజేపీ సీనియర్ నేత, కాలం కలిసొస్తే కాబోయే ముఖ్యమంత్రి అయిన సుశీల్ కుమార్ మోడీగారి భార్యామణి నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి లెక్చరర్ పోస్టు సంపాదించుకున్నారు. 1990ల్లో జరిగిన లెక్చరర్ స్కామ్‌లో భాగమైన అక్రమ నియామ కాలకు ఇదో మచ్చు తునక మాత్రమే. మోడీ సేనలో ఒకరైన మానవ వనరుల శాఖా మంత్రి రామ్ శంకర్ కఠేరియా సైతం నకిలీ పట్టాల ఆరోపణల్లో పీకల దాకా కూరుకుపోయారు. ఫోర్జరీ చేసిన మార్కుల

షీటుతో సార్ ఏకంగా కేంద్ర మంత్రివర్గం లోకి వచ్చేశారు. ఇప్పటికి బైటపడిన అబద్ధాల చదు వుల రాయుళ్ల వీరు. ఇంక బైటికి రాని నకిలీ సర్టిఫికెట్ల రాకెటర్లు ఎందరున్నారో! మోడీ గారికే ఎరుక!

ఏం పీకలేరా!

సుష్మ, స్మృతి, శివరాజ్, రాజే ... నల్గురూ నల్గురే. స్మృతి కొత్త కార్యకర్తే అయినా మిగతా ముగ్గురూ పాత కాపులే. సొంత పార్టీకి ఎంత ముఖ్యులైనా వీరి మీద వస్తున్న అవినీతి ఆరోపణలు మామూలువి కావు. ఈ నేపథ్యంలో ఆ పెద్ద మనుషులను పదవుల నుంచి తప్పిస్తే అయినా ప్రమాణ స్వీకార సందర్భంగా రాజ్యాంగం మీద చేసిన ప్రమాణానికి కాస్తలో కాస్త న్యాయం చేసినవారయ్యేవారు. కానీ బి.జె.పి పెద్ద తలకాయల ఆలోచన ఒక్కటే. సుష్మ స్వరాజ్ సీనియర్ నాయకురాలు. ప్రస్తుతానికి బి.జె.పి మహిళా నేతల్లో ఆమెకున్నంత ఫేస్ వాల్యూ మరెవరికీ లేదు. ఒకరకంగా చూస్తే మోడీతో సమానంగా ప్రధాని పదవి రేస్‌లో వున్న క్యాండిడేట్. అలాంటి నేతను వదులుకోవడం సహజంగానే పార్టీకి ఇష్టం వుండక పోవచ్చు. ఇహ వసుంధర రాజే! రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించిన నాయకురాలు. దీనికితోడు ఆమెకు అండగా ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్ద సంఖ్యలోనే వున్నారు. ఒకవేళ ఆమెతో పదవికి రాజీనామా చేయిస్తే తిరుగుబాట్లు, అసంతృప్తి ముఠాలు పుట్టకుండా వుండదు. శివరాజ్ విషయంలోనూ ఇదే పరిస్థితి వుంది. పోనీ స్మృతితోనైనా రాజీనామా చేయిద్దామా అంటే ప్రతిపక్షానికి అలుసైపోతుందేమోనని అనుమానం. పైగా బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి పెద్ద రాష్ట్రాలలో ఎన్నికలు రానున్న ఈ సంధి కాలంలో రాజకీయ రచ్చ చేసుకోవడం ఇష్టం వున్నట్టు లేదు బిజెపి అధిష్టానానికి. దాంతో వారిని ఏం పీకలేక... కక్కలేక... మింగలేక... ప్రతిపక్షాలకు.. ప్రజలకు స్కాము లపై సమాధానాలు చెప్పలేక కిందమీదై పోతున్నట్లు కనిపిస్తోంది.

'మహా' స్కాములు

కమలనాథుల ఏలుబడిలో వున్న మహారాష్ట్ర స్కాముల గోలతో మార్మోగిపోతోంది. వినోద్ తావ్డే నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వంతో తల బొప్పి కట్టిన బి.జె.పి నేతలను చిక్కీల స్కామ్ కూడా తుగులుకోవడంతో ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. బిజెపి సీనియర్ నేత గోపీనాథ్ ముండే కుమార్తె పంకజా ముండే. తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఈమె ప్రస్తుతం రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖా మంత్రిగా వున్నారు. పాఠశాల విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, వస్తువులకు సంబంధించిన 206 కోట్ల రూపాయల స్కామ్‌లో కూరుకుని ఊపిరాడక అల్లాడుతున్నారు. వేరుశనగ పప్పు, బెల్లంతో చేసిన తీపి పదార్థం చిక్కీ (పప్పు చెక్క), ఇతర పుస్తకాలు, చాపలు, మంచినీళ్ల ఫిల్టర్ల కొనుగోలుకు సంబంధించిన కొనుగోళ్లలో భారీ అవకతవకలకు కారణమయ్యారు పంకజ. ఐసిడిఎస్ పథకం కింద గిరిజన చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశ్యంతో చిక్కీ కూడా ఇస్తుంటారు. అలాంటి బీద పిల్లలకు అందించే వస్తువుల కొనుగోళ్లను హడావిడిగా ఆఖరి నిముషంలో టెండర్లను పిలవకుండా కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీటికి సంబంధించి ఒకే రోజు 24 ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3 లక్షల రూపాయలకు పైన ఏదైనా కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా ఈ-టెండర్లను పిలవాలి. అదేం లేకుండా ఆశ్రితులకు కాంట్రాక్టులు అంటగట్టేసి చవకబారు, నకిలీ వస్తువులను పుచ్చుకున్నారు. బీద పిల్లల నోటికాడి చిక్కీ, చదువుకునే పుస్తకాలు, వాడుకునే వస్తువుల విషయంలోనే దయాదాక్షిణ్యాలు లేకుండా అవకతవకలకు పాల్పడ్డారంటే ఏమనుకోవాలి?

ఇక విద్యా మంత్రి వినోద్ తావ్డే నకిలీ విద్యా సర్టిఫికెట్లతోనే సరిపుచ్చుకోలేదు! స్కూళ్లలో ఉపయోగించే అగ్నిమాపకాల కొనుగోళ్లలో అవకతవకలకూ కారణమయ్యాడు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్ స్కూళ్లలో అగ్నిమాపకాలను ఇష్టమొచ్చిన రీతిలో కొనేశారు. పంకజా ముండే మాదిరిగానే ఈయనగారు కూడా టెండర్ల ఊసే మర్చిపోయారు. 191 కోట్ల రూపాయల కాంట్రాక్టును ఆశ్రితులకు అప్పణంగా అందించారు. అదేమంటే మంత్రులిద్దరూ చేసిన తప్పు కప్పి పుచ్చుకోవడానికి వంకలు, సాకులు వెతుకుతున్నారేకానీ జరిగిన తప్పిదాన్ని గుర్తించి ఒప్పుకోవడం లేదు. ఆఖరికి వీరి దళపతి, రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన దేవేంద్ర ఫడ్నవిస్ సైతం స్కాము కింగులు, క్వీన్లను వెనకేసుకొస్తున్నారు. అంతకు మించి వీరిని సరిదిద్దడానికిగాని, మరెక్కడా ఇలాంటి అవకతవకలు జరగకుండా వుండేందుకు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచిత్రం.

పంకజా ముండే


వినోద్ తావ్డే

ఉత్తుత్తి మాటలేనా!

దేశంలోనే కాదు. విదేశాల్లోనూ మోడీ గారిది ఒకటే మాట. తమది భిన్నమైన పార్టీ అట. స్వచ్ఛమైన పార్టీ అట. కళంకితులు లేని పార్టీ అట. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పలికిన చిలక పలుకులు ఇవే. అవినీతి అంటే ఏంటో తెలీనట్టు, స్కాముల స్పెల్లింగు తెలీదన్నట్టు మాట్లాడారు. వీలైన చోటల్లా చూపుడు వేలు చూయించి మరీ 'న ఖానూగా, న ఖానే దూంగా' (నేను తినను, మరొకరిని తిననివ్వను) అని ఉద్ఘాటించారు. మరి బార్లా తెరచుకొన్న మోడీ గేట్లు, సుష్మా-రాజేల నేరారోపణలు, వ్యాపమ్ పాపాలు, వందల కోట్ల రూపాయల అవకతవకల గురించి ఏం చెప్తారు? లమో విషయంలో నమో ఎందుకు మౌనంగా వుంటున్నారు? అత్యంత ఉన్నత పదవిలో వున్నాక మౌనంగా వుంటే కుదరదు కదా. ప్రజలకు జవాబుదారీగా వుండొద్దా? వీటన్నిటికీ నరేంద్రమోడీగారు సమాధానం చెప్పాలి. అవినీతితో ఆశ్రిత పక్షపాతంతో అవకతవకలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కేంద్ర మంత్రులు,రాష్ట్ర ముఖ్యమంత్రులని మిన్నకుంటే ప్రజలు చూస్తూ ఊరుకుంటారా? సదరు పెద్దలను వెంటనే పదవులనుంచి తప్పించొద్దూ! దర్యాప్తుల్లో వాస్తవాలు వెల్లడయ్యాకే వారిని తిరిగి గద్దెనెక్కించాలో లేదో ఆలోచించుకోవడం ఉత్తముల లక్షణం. లేకుంటే ప్రధాని మోడీ గారిపైనా దేశ ప్రజలు అనుమానం కలిగినా ఆశ్చర్యం లేదు! ✦

ప్రసవం ఒక మరణం

మూలం: హన్నా కేథరిన్ ముల్లిన్స్
తెలుగు: డా॥ దేవరాజు మహారాజు

◆ కథ

మధు అంత్యక్రియలైన తర్వాత రెండు రోజులకు నేను మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళి అతని తల్లిని చూసొచ్చాను. ఊరి నుండి వచ్చిన అతని భార్య రాణిని పరామర్శించాను. ఏమైనా నేను అన్న ప్రకారం రెండోసారి వాళ్ళింటికి వెళ్ళడం వారికి ఎంతో మేలు చేసింది. రాణి నిండు చూలాలు. ఒక వైపు భర్త మరణం మరోవైపు గర్భిణి నొప్పులు, శారీరకంగా, మానసికంగా ఆమె పరిస్థితి ఎంత సున్నితంగా పరిణమి స్తోందన్న విషయం ఆమె చుట్టూ ఉన్న ఆడ వాళ్ళకు పట్టలేదు. మూర్ఖంగా ప్రవర్తిస్తూ ఆమె ప్రసవాన్ని మరింత కష్టతరం చేశారు.

పది పన్నెండు మంది ఆడవాళ్ళు రాణి చుట్టూ నిలబడి ఆజ్ఞలు గుప్పించారు. కూర్చోమని ఒకరంటే నిలబడ మని ఒకరు. చుట్టూ తిరగడం మంచిదని మరొకరు. ఒకరు ఏదో రసం తాగించాలనడం, మరొకరు ఏదో మందు వేయండనడం, అలా ఆ అమ్మాయికి ఊపిరి సలపకుండా చేశారు. ప్రకృతి సిద్ధంగా సహజంగా జరగాల్సిన ప్రసవానికి అడ్డంకులు సృష్టించడంతో ఆ అమ్మాయి నరకయాతన అనుభవిం చింది. సరే ఇవన్నీ అలా ఉండనిచ్చి పనికి రాని మూఢ నమ్మకాలతో మరింత కాలయాపన చేయడం నాకు ఎంతో బాధను కలిగించింది. ఎవరైనా తుమ్మితే చేసే పని ఆపడం, బల్లి అరుపు వినిపిస్తే ప్రయాణం మానుకుని ఆ రోజు బయటికి వెళ్ళకుండా ఉండడం, పొద్దున్నే కోతి ముఖం చూడకుండా ఉండడం, చంద్రగహణం పట్టినపుడు ఏదీ కోయకుండా ఉండడం, ఒంట్లో బావుండకపోతే దేవుడి దండ మెళ్ళో వేసుకోవడం ఇలాంటి విశ్వాసాలన్నీ కేవలం మధు వాళ్ళ ఇంట్లోనే కాదు, ఆ ప్రాంతంలోని అందరి ఇళ్ళలోనూ ఉండేవి.

రాణి రెండు నెలల క్రితం వారి అత్తగారికి చెప్పిందట! ఓ రోజు సాయంత్రం తన తలపై నుండి గుడ్లగూబ అరుచుకుంటూ పోయిందని! ఈ మూర్ఖపు మహిళలు ఇప్పుడు ఆ విషయం గుర్తు చేసుకుని ఆ కారణం వల్ల రాణి అవస్థ పడుతోందని అలా ఎగిరిపోయిన గుడ్లగూబ తిరిగివస్తే గాని ఆమె ప్రసవించదని అనుకున్నారు. అంతమందిలో ఒకావిడ మాత్రం ఆ విషయాన్ని ఒప్పుకోలేదు. తన కోడలు తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్నప్పుడు గుడ్లగూబ అలాగే తల మీది నుంచి పోయిందని, కానీ అది ఆమె మీద ఏ ప్రభావమూ చూపలేదని చెప్పింది. అందుకు మరొకామె అంది "నేనది అసలు నమ్మను. పోయిన పక్షి తిరిగి రానిదే ప్రసవం జరగడం కల్ల! అయినా ఆ పక్షి తిరిగి వచ్చిందేమో,ఎవరూ దాన్ని గమనించలేదేమో" అని.

దానికి సమాధానంగా మొదట మాట్లాడిన మహిళ అంది. "ఆ మధ్య ఒకసారి రాణి ఓ ముసలావిడతో కాళీపూర్ పారి పోయింది కదా! అక్కడేమో ఆ ముసల్ది ఈమెకు నిద్రమందిచ్చి బంగారు ఆభర ణాలన్ని దోచుకుపోయింది. నాకేమనిపి స్తోందంటే ఆ ముసల్ది ఏదో మంత్రగత్తె అయి ఉంటుంది. అది

అప్పుడు పెట్టిన మంత్ర ప్రభావం వల్ల రాణి ఇప్పుడు సుళువుగా ప్రసవించడం లేదు.”

ఈ మాటకు ఒకరిద్దరు తలూపారు “ఆహా అంతే అయి ఉంటుంది.” అని అన్నారు. మధు తల్లి మాత్రం “నా మనవణ్ణి నేనింకా ఎప్పుడెత్తుకుంటాన్రా?” అని గగ్గోలు పెట్టింది. కాని కోడలికి ఏమైందన్నది ఆమె ఆలోచించడం లేదు. ఇరుగు పొరుగు వారు ఆమెను హెచ్చరించారు. ఏదో ఒకటి చేయకపోతే తల్లి కాదు కదా బిడ్డ కూడా దక్కదని భయపెట్టారు.

“ఎవరినైనా ఆ కాళీపూర్ పంపి ఆ మంత్ర గత్తెను పిలిపించనా? ఆమె కాళ్ళ మీద పడి నా వంశాకురాన్ని నాకిప్పించమని ప్రార్థించనా?” అని మధు తల్లి అందరినీ అడిగింది. ఇదంతా విని రాణి నన్ను దీనంగా అర్థించింది. “అమ్మగారూ! ఇక మీరే నాకు దిక్కు! సరిపడే మందేదో మీరే ఇప్పించండి. కాళీపూర్ ఇక్కడుందా? రెండు రోజులు పోవడం, రెండు రోజులు రావడం. పోయినవాడు తిరిగి రాక ముందే నా ప్రాణం కాస్తా పోతుందమ్మగారూ! మీకు దండం పెడతా నా భారం మీదే! తెలిసీ తెలియని వైద్యాలు చేసి నా ప్రాణం మీదికి తేవొద్దని కాస్త మా వాళ్ళకు మీరే చెప్పండి!” అని.

రాణి ఆ మాట అన్నాక ఇక నేను కల్పించుకోక తప్పలేదు. నా మీద గౌరవంతో నన్ను ‘అమ్మగారూ’ అని పిలుస్తుంది తప్ప, రాణి నా చిన్ననాటి స్నేహితురాలు. “లేని పోనివన్నీ ఎందుకు తాగిస్తున్నారూ? ఏదైనా బలమైన ద్రవాహారం ఇవ్వొచ్చు కదా?” అని అన్నాను. అందుకు రాణి వాళ్ల అత్తగారంది “ప్రసవించాక ఇవ్వొచ్చు లెండి. ఇప్పుడెందుకు మధ్యలో తింటూ కూర్చోవడం? అసలు ఇది తినే సమయమా చెప్పండి?”

నాకు చిర్రున కోపం వచ్చింది. ఈ అజ్ఞానులకు ఏమని చెప్పడం? అని అనుకుని అక్కడున్న వాళ్ళను ఇష్టం వచ్చినట్టు కేకలేశాను. “ఏం మనుషులు మీరూ? ఏళ్ళొచ్చాయి గానీ బుద్ధి పెరగలేదు. అమ్మాయి ముఖం చూశారా? వారం రోజులు లంఖణాలు చేసినట్టుగా ఉంది. మరి కొంత సేపు ఇలాగే వదిలేస్తే స్పృహ కూడా కోల్పోతుంది. ఇంకా ఆమె మీకు మనవడిని ఎక్కడ కంటుంది. అందుకు ఓపికేది?”

ఒకసారి అమ్మలక్కల వైపు కోపంగా చూసి “ఎవరింట్లోనైనా చేపల సూపు ఉందా? ఉంటే వెంటనే పట్టుకు రండి.” అని దాదాపు గద్దించినంత పనిచేశాను. ఓ పడుచు గబుక్కున లేచి తన ఇంటి వైపు పరుగెత్తింది. కానీ ఒకరిద్దరు ముసలి ముత్తయిదువలు హేళనగా తలలు తిప్పి “ఇలాంటివన్నీ ఇంగ్లీషు ఆడాళ్ళకు పని చేస్తాయేమో. మాకు ఇక్కడ ఇలాంటి పద్ధతులు నప్పవు. ప్రసవానికి ముందు చేపల సూపా? హవ్వ!! ఇంక ఆ పిల్ల బతికేనా?” అని దీర్ఘాలు తీశారు. ఇంతలో ఇంటివైపు పరిగెత్తిన యువతి చేపల సూపుతో తిరిగొచ్చింది. నేనది రాణికి అందించాను. ఆమె గబ గబా తాగేసి “అమ్మగారూ! ఇప్పుడు కాస్త ఊపిరి వచ్చినట్టుగా ఉందండి.” అని అంది. కాసేపు పడుకోనిస్తే నొప్పులేమైనా తగ్గుతాయేమో.. అని కూడా అంది.

నేనక్కడికి రాక ముందు మూర్ఖురాళ్ళందరూ కలిసి ఆ అమ్మాయిని పాపం మూడు గంటలు కాళ్ళ మీద కూర్చోబెట్టారు. అందుకు తట్టుకోలేక ఆమె సోలిపోయింది. “ఆ అమ్మాయిని కాసేపు పడుకోనిస్తే ఎంత బావుండేది?” అని అన్నాను. నా మాట వారికి నచ్చినట్టుగా లేదు. “మీ ఇంగ్లీషు వాళ్ళకూ మా బెంగాలీ వాళ్ళకూ చాలా వ్యత్యాసముందిలే అమ్మా!. మా పద్ధతులు మావి. మేమిలా కాళ్ళ మీద కూర్చోబెట్టి కాన్పు చేయిస్తాం.” అన్నారు. ఇంతలో మంత్రసాని కల్పించుకుని “ఇంకా నాకేమీ తెలియదమ్మా! అంతా ఆ అమ్మగారిదే భారం! నా బాధ్యతేమీ లేదు.” అంది చేతులు తిప్పుకుంటూ.

“అయితే సరే! నేనే చూసుకుంటాను. మీరంతా పక్కకు తప్పుకోండి.” అని అన్నాను. ఇలాంటి సమయాల్లో ఏం చెయ్యాల్లో ఎలా చెయ్యాలో నాకు బాగా తెలుసు. వీళ్ళ మూర్ఖత్వం నిండు చూలాలి ప్రాణం హరించేట్టుగా ఉంది.. అనుకుని రాణిని పడుకోబెట్టాను. దానితో ఆమె శరీరం ఆమె ఆధీనంలోకొచ్చింది.ఎడమ వైపు తిరిగి కొద్ది కొద్దిగా వేడి పాలు తాగమన్నాను. గంటలో రెండు మూడు సార్లు

పాలు తాగించాను. మంత్రసాని కడుపు పైభాగాన కట్టిన గుడ్డ గమనించాను. వెంటనే దాన్ని తొలగించాను.

“అయ్యో! బిడ్డ మళ్ళీ ఎగిసిపడుతుంది! అందుకే కట్టించామా గుడ్డ!!” అన్నారు గోలగోలగా. వాళ్ళ అజ్ఞానానికి చిరాకు పడ్డాను. అది గమనించి “అమ్మగారికి తెలుసు ఏం చేయాలో. మీరు కూర్చోండి కాసేపూ.” అని రాణి వారిని కసురుకుంది. నా మీద రాణికి రాణి మీద నాకు విశ్వాసం పెరిగింది. ఆమె ముఖంలో అలసట తీరిన విశ్రాంతి ఛాయలు కనిపించాయి. ఇక పరవాలేదు, సుఖంగా బిడ్డను కంటుంది. అని అనిపించింది. ప్రశాంత వాతావరణం నెలకొనడంతో అమ్మలక్కల నోళ్ళు మూత పడ్డాయి.

మంత్రసాని తన తప్పు తెలుసుకుందో ఏమో “అమ్మా కాన్పు నేను చేస్తాలేమ్మా! మీకెందుకు శ్రమ” అని మళ్ళీ దగ్గరికొచ్చింది. మూడుసార్లు ప్రయత్నించి విఫలమయ్యావు. ఇంక నీతో ఈ పని కాదులే వెళ్ళు. అయినా ఎవరూ ఏమీ చేసేది లేదు. సమయమొస్తే దానంతట అదే సహజంగా అయిపోతుంది” అన్నాను, నా కోపం కనబడనీయకుండా. నేనా మాట అన్నానో లేదో రాణికి ఒక్కసారి నొప్పులు ఉధృతమై ఏడు నిమిషాల్లో పండులాంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. నాకు చాలా సంతోషం కలిగింది. కానీ వెనువెంటనే ఎంతో బాధ కూడా కలిగింది. మూఢనమ్మకాల వల్ల, మంత్రసానుల అజ్ఞానం వల్ల ఎంత మంది గృహిణులు తమ బిడ్డలకు జన్మనివ్వలేక పోతున్నారో కదా? ప్రసవమే ఓ నరకమైతే, దాన్ని ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని ఇవ్వకుండా మరింత బెంబేలెత్తించడం ఏం న్యాయం? అని ఆలోచిస్తూ ఉండగా రాణి తేరుకుని చిరునవ్వు నవ్వింది. ఆమె చిరునవ్వులో కొత్తప్రాణి దర్శనమిచ్చింది. కొత్త వెలుగులు ప్రసరించాయి. భూమి మీద పడ్డ బిడ్డ ఏడుపులో మంగళ వాయిద్యాలు వినిపించాయి.

✦

రచయిత్రి గురించి

హన్నా కేథరిన్ ముల్లిన్స్ (1826-1861) బ్రిటిష్ మహిళ అయినా భారతీయ జీవితంతో అవినాభావ సంబంధం ఏర్పరుచుకుని దాన్ని సాహిత్యీకరించారు. బెంగాలీ నవల ‘ఫూల్ మణి ఓ కరునార్ బిబరన్’ను అందించి భారతీయ సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. బెంగాల్‌లో విరివిగా రచనలు చేసి మిషనరీల తరఫున పలు సాంఘిక కార్యక్రమాలు చేపట్టారు. గర్భవతుల సమస్యలు, పిల్లల సంరక్షణ వంటి విషయాల మీద దృష్టి కేంద్రీకరించి కృషి చేశారు. రచయిత్రిగా, సామాజిక కార్యకర్తగా ఆమె వ్యక్తిత్వం విశిష్టమైంది. కలకత్తాలో పుట్టి పెరిగిన హన్నా ముల్లిన్స్ జీవించింది, ముప్పై అయిదేళ్ళే!

క్రేజీ

తూలే దారి

మన నగరాల్లో చాలా చోట్ల కొండలపై, గుట్టలపై ఇళ్లు ంటాయి. వాటిని చేరేందుకు లెక్కపెట్టలేనన్ని మెట్లెక్కాల్సిందే. అవే మెట్లే లేకుండా ఏటవాలుగా రోడ్డేసి ఇంటికెళ్లమంటే ఆయాసం బదులు కోపం వచ్చేస్తుంది. ప్రపంచంలోనే అతి వాలు రోడ్డున్న బాల్డ్‌విన్ వీధి వాళ్లు అలా కాదు. సరదాగా ఓ ఉత్సవాన్ని నిర్వహించుకుంటూ వారి ఏటవాలు రోడ్డును గర్వంగా ఎక్కేస్తున్నారు.

న్యూజిలాండ్‌లోని డునెడిన్ నగరంలో ఉంది బాల్డ్‌విన్ వీధి. అక్కడ చాలా గృహాల ముందు సెల్ఫీలు దిగితే ఒక పక్క భూమిలోకి కుంగిపోయినట్టుగా అనిపిస్తాయి. ఆ దారెంట కారులో వెళుతూ పక్కకు చూస్తే ఏ భూకంపమో వచ్చి వీధి వీధంతా తలకిందులైనట్టు తోస్తుంది. వెళ్లడం పక్కన పెట్టండి ముందు కారు తోలడమే ఓ సవాలు. ఇంత వింత అనుభవాలను కల్పిస్తుంది ఆ దారి. 350 మీటర్ల ఆ రోడ్డు పైకి వెళ్లేసరికి 70 మీటర్ల ఎత్తుకు చేరకుంటారు. ఏటవాలుగా ఉండే ఆ రోడ్డు తెచ్చిన తంటానే అది. ప్రతి రెండున్నర మీటర్లు పైకి వెళుతున్న కొద్దీ మీటరు ఎత్తున వాలు పెరుగుతుంటుంది. కొత్త వాళ్లు ముందుకు కదులుతుంటే నడుస్తూ వెళ్లేందుకు పాకుతూ వెళ్లాల్సిందేమో అనుకోవడం ఖాయం. కొండలు, లోయలతో ఉండే ఆ ప్రాంతంలో ఇళ్లను కట్టి వాటికి రహదారులు వేసేందుకు ఇంగ్లండ్ నుంచి ఇంజనీర్లను తెప్పించారు. వారు చకచకా ప్లాన్‌లు వేసుకుని మెట్టు మెట్టుగా ఇళ్లను కట్టుకుంటూ పోయారు. తీరా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక తెలిసొచ్చింది వాటికి మార్గం వేయడం కష్టమని. సామాన్యులకు వీలుగా మలుపులతో దారి వేద్దామంటే అప్పటికే కట్టడాలు పూర్తి కావొచ్చాయి. వాటిని తొలగించి దారి చేసుకుంటూ పోదామంటే మొత్తం ప్లానే మార్చేసుకోవాలి. ఇదంతా తలనొప్పి అని గ్రహించిన ఇంజనీర్లు ఏటవాలుగా ఒకే క్రమాన రోడ్లు వేసేశారు. వీరి తెలివి తక్కువ ప్రణాళికతో నివాసులు నానా తంటాలు పడేవాళ్లు. కొన్నాళ్లకు ఆ దారి అలవాటు చేసుకుని ఎలాగో అలా వీధి దాటగలిగారు. కొత్తగా వచ్చేవాళ్లతో ఆ దారి ప్రత్యేకత ఆ నోటా ఈ నోటా అందరికీ తెలిసి క్రేజ్ ఏర్పడింది. కాళ్లు, నడుం నొప్పులతో ఇబ్బందిపడ్డ స్థానికులు ఆ క్రేజ్ వల్ల బాధల్ని మరిచిపోయారు. కొందరు ఔత్సాహికులు దీన్ని ఫిట్‌నెస్‌కు అన్వయించుకున్నారు. ఆ రోడ్డు పేరిట ఫిట్‌నెస్ నడకను చేపట్టారు. ప్రపంచంలోనే అతి ఏటవాలుగా ఉన్న రోడ్డుగా దానికి గుర్తింపు రావడంతో ఉబ్బితబ్బిబై ఓ ఉత్సవాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా అథ్లెట్లకు 'బాల్డ్‌విన్ స్ట్రీట్ గట్ బస్టర్' పోటీలు నిర్వహిస్తారు. అందరికంటే ముందు పైకి చేరుకోవడమే పందెం. ఓ వ్యక్తి నిమిషం 56 క్షణాల్లో ఎక్కేశాడట. పిల్లల కోసం కూడా జఫ్ఫా రేస్‌ను నిర్వహిస్తారు. 25 వేల చాకెట్లను పైనుంచి కిందకు దొర్లిస్తారు. ప్రతి దానిపై ఓ నంబర్ వేసి దాన్ని అందుకున్న వారికి బహుమతులిస్తారు. వీటిని పట్టుకునేందుకు పిల్లలకు పోటీగా పెద్దలూ ఎగబడతారనుకోండి. అలా 25 వేల చాక్లెట్లను చప్పరించేశాక పాటలు, డ్యాన్సులతో వీధిని హోరెత్తించేస్తారు. ఆ తర్వాత 30 వేల టెన్నిస్ బంతుల్ని దొర్లిస్తారు. వాటిని దొరక బుచ్చుకుని తర్వాత గ్రౌండ్ తీసుకెళతారనుకోండి. 2010లో కార్డ్రోనా స్టంట్‌మన్ ఇయాన్ సోనెస్ మోటార్ బైక్ ఒంటి చక్రంపై రోడ్డును దిగి రికార్డు సృష్టించాడు. ఈ సరదా ఆటలే శృతి మించి 2001లో ఒటాగో విశ్వవిద్యాలయ విద్యార్థిని చనిపోయింది. మిత్రురాలితో కలిసి చక్రాల కుండీ (వీలీ బిన్)లో ఎక్కి పై నుంచి దొర్లింది. అది వేగంగా ఓ ట్రాలీ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. మిత్రురాలికి బలమైన గాయాలయ్యాయి. కొందరు స్థానికులు మాత్రం ఆ వీధి పైకి ఎక్కడానికి ఇప్పటికీ సాహసించడం లేదు. అత్యవసర పని పడితే కానీ పైకి వెళ్లని వాళ్లూ ఉన్నారు. ✦

ఖీమా సాగ్

కావలసిన పదార్థాలు
మటన్ ఖీమా: 750 గ్రా
ఆకు కూర: 3 కట్టలు
ఉల్లిపాయలు: 2
అల్లం వెల్లుల్లి పేస్ట్: 2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి: 4
టమోటో గుజ్జు: 2 టీ స్పూన్లు
నిమ్మరసం: 2 టీ స్పూన్లు
పెప్పర్ కార్న్: 10
కారం: 1 టీ స్పూను
జీలకర్ర పొడి: 2 టీ స్పూన్లు
ధనియాల పొడి: 2 టీ స్పూన్లు
గరం మసాలా పౌడర్: 2 టీ స్పూన్లు, కొత్తిమీర: 2 కట్టలు
ఉప్పు: రుచికి సరిపడా
నూనె: 3 టీ స్పూన్లు

తయారీ విధానం
ముందుగా ఖీమాను ఒక బౌల్లో వేసుకొని అందులో నిమ్మ రసం, ఉప్పు, అల్లం వెలుల్లి పేస్ట్, కారం, జీలకర్ర పొడి, ధనియాల పొడి వేసి మొత్తం మిశ్రమాన్ని కలగలుపుకొని మ్యారినేట్ చేసి పక్కన పెట్టు కోవాలి. అరగంట తర్వాత స్టౌ మీద పాన్ పెట్టి అందులో నూనె వేసి వేడి అయ్యాక అందులో బిర్యానీ ఆకు, మిరి యాల పొడి, ఉల్లిపాయ ముక్క లు వేసి సన్నని మంట మీద ఫ్రై చేసుకోవాలి. ఉల్లి పాయ ముక్కలు బంగారు వర్ణంలోకి మారిన తర్వాత అందులో మ్యారినేట్ చేసిన ఖీమా వేసి మీడియం మంట మీద 5 నిమి షాలు ఉడికించు కోవాలి. తర్వాత అందులో ఆకు కూర మిక్స్ చేసి ఖీమాతో బాగా కలపాలి. తర్వాత ఉప్పు వేసి కలిపి మూత పెట్టి మరో 10 నిమిషాలు ఉడికించుకోవాలి. మొత్తం మిశ్రమం ఉడికిన తర్వాత గరం మసాలా మరి యు కొత్తిమీర తరుగు వేసి కల పాలి. అంతే ఈ ఖీమా సాగ్ రెడీ.

బటర్ ఖీమా మసాలా

కావలిసిన పదార్థాలు
మటన్: 1 కేజీ, పెరుగు: 1 కప్పు
బటర్: 1 కప్పు
అల్లం పేస్ట్: 3 టీ స్పూన్లు
వెల్లుల్లి పేస్ట్: 3 టీ స్పూన్లు
ఉల్లిపాయలు: 3
లవంగాలు: 5, దాల్చిన చెక్క: 1
బ్లాక్ యాలకలు: 2
గ్రీన్ యాలకలు: 2, పచ్చి మిర్చి: 8
బిర్యాని ఆకు: 1, ఉప్పు: రుచికి సరిపడా, కారం : 3 టీ స్పూన్లు
కొత్తిమీర తరుగు: కొద్దిగా

తయారీ విధానం
ముందుగా ఫ్రైయింగ్ పాన్లో కొద్దిగా నూనె వేడి చేయాలి. తర్వాత అందులో లవంగాలు, దాల్చిన చెక్క, యాలకలు, బిర్యానీ ఆకు, పచ్చి మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి ఫ్రై చేసుకోవాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి అందులో ఒక కప్పు నీళ్ళు పోసి బాగా మిక్స్ చేయాలి. తర్వాత కొద్దిసేపు ఉడికించుకోవాలి. ఇప్పుడు పాన్లో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. అందులో ఖీమా వేసి కొద్దిసేపు ఫ్రై చేసుకోవాలి. అందు లోనే సన్నగా తరిగి పెట్టుకొన్న టమోటో ముక్కలు కూడా వేసి మరికొద్ది సేపు ఉడికించుకోవాలి. ఈ ఖీమా మిశ్రమానికి బటర్ జోడించి మిక్స్ చేయాలి. ఇప్పుడు ఈ ఖీమా మిశ్రమాన్ని ముందుగా తయారు చేసుకున్న మసాలాతో కలపాలి. తర్వాత అందులో ఉప్పు, కారం డ్రై అయ్యే వరకూ ఫ్రై చేసుకోవాలి. అందులో పెరుగు వేసి మిక్స్ చేసుకోవాలి. మంట తగ్గించి ఖీమా మొత్తం ముక్కకు పట్టే వరకూ ఉడికించుకోవాలి. తర్వాత పచ్చిమిర్చి, ఎండు మిర్చి, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేయాలి. బటర్ ఖీమా మసాలా రెడీ.

మిర్చి కుర్మా

కావలసిన పదార్థాలు
ఎండు మిర్చి : 10
ఉల్లిపాయలు: 3
దాల్చిన చెక్క: 2, లవంగాలు: 2
అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టీ స్పూను, జీలకర్ర: 1 టీ స్పూను
మీట్ మసాల: 1 టీ స్పూను
సోంపు పొడి: 1 టీ స్పూను
చింతపండు: 2 టీ స్పూన్లు
ఉప్పు: రుచికి సరిపడా
మాంసం: 1 కేజీ
నూనె: సరిపడా

తయారీ విధానం
ముందుగా పాన్లో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. తర్వాత అందులో సన్నగా తరిగిపెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలు వేసి బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేపుకోవాలి. అందులోనే మటన్ వేసి కొద్దిసేపు ఫ్రై చేశాక... దాల్చిన చెక్క, లవంగాలు, యాలకలు, సోంపు, జీలకర్ర, మీట్ మసాలా పౌడర్ వేసి మొత్తం మిశ్రమాన్ని కలగులుపుతూ ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు అందులో కొద్దిగా నీళ్ళు మిక్స్ చేసి15 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ప్రెజర్ కుక్కర్లో వేసి రెండు విజిల్స్ వరకూ ఉడికించు కోవాలి. తర్వాత వేరే గిన్నెలో ఎండు మిర్చి వేసి కొద్దిగా నీళ్ళు పోసి మొత్తబడే వరకూ ఉడికించాలి. తర్వాత నీరు వంపేసి మిక్సీ జార్లో మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఇప్పుడు మటన్ మిశ్రమంలో చింత పండు పేస్ట్, మిర్చి పేస్ట్ వేసి బాగా కలిపి మరికొద్దిసేపు ఉడికించుకోవాలి. చివరగా కొత్తిమీర తరుగు వేసి వేడి వేడిగా వడ్డించాలి.

చుక్కలు కలపండి

ఎక్కడున్నాయి?

ఇదో అడవి. బోలెడన్ని జంతువులు, వృక్షాలు. వీటి మధ్యలో పది వస్తువులు దాచి పెట్టాడు బాచి. ఈ బొమ్మలోనే ఒక పక్కగా ఇచ్చాం. బూట్లు, వాచ్చి, టోపీ, తాపీ మేస్త్రి వాడే వస్తువు, కేకు ముక్క, గిన్నె, ఉంగరం, పర్సు, పెన్సిల్. మరి ఆలస్యం ఎందుకు?



ఎవరికి ఏది ఇష్టం?



మాటల పుష్పం

పదాల వృత్తము

ఆధారాలతో తెలుగు పదాలు వృత్తాలలో నింపుట

1.మోక్షము 2. బలము 3.ఆధ్యాత్మిక భావన 4.ఉపాయము

5. మంచిమాట 6.తినుట 7.జోరు 8.వరుస



ఇక్కడ ఏడు రకాల పదాలు ఉన్నాయి. అయితే వృత్తంలోని అక్షరంతో కలిపితే సరైన పదం వచ్చే విధంగా పదాలను సమకూర్చండి.

దారి కనుక్కోండి



చూసి గీయండి

మీకు ఆర్టిస్ట్ అంకుల్ కుందేలు బొమ్మ ఏలా గీయాలో నేర్పుతాడు. అల్లరి చేయకుండా శ్రద్ధగా వేసేయండి.



జిరాఫీ ఎక్కడ?

ఈ జిరాఫీ ఎంత బావుందో. అయితే ఇక్కడే మరో జిరాఫీ కూడా వుంది. కనిపెట్టండి.



పిల్లల 'ఒలంపిక్స్'

పిల్లలకు ఒలంపిక్స్ గేమ్స్ స్థాయి ఆటల పోటీలు జరుగుతాయని తెలుసా మీకు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీలకు ఒలంపిక్స్ సంఘమే సాయం చేస్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొంటారు. ప్రతి ఏటా జరిగే పోటీలు ఈ నెలలోనే 24 నుంచి జరగబోతున్నాయి. ఈ అంతర్జాతీయ పిల్లల క్రీడోత్సవానికి వేదికైంది నెదర్‌ల్యాండ్స్‌లోని అల్‌క్మార్. ఈ పోటీల్లో ప్రత్యేకత ఏమిటంటే దేశం పేరిట కాకుండా నగరాల పేరిట జట్లు పాల్గొంటాయి. నేటి చిన్నారులే రేపటి భవిష్యత్తుకు ప్రతినిధులని, వారి మధ్య స్నేహం వెల్లివిరిస్తే ప్రపంచ శాంతి తేలికవుతుందనే ఉద్దేశంతో వివిధ ప్రాంతాల పిల్లల్ని ఒకే వేదిక మీదకు తెచ్చారు. 12-15 ఏళ్ల వయసున్న పిల్లలకే ఈ పోటీలు. కేవలం ఆటల పోటీలా కాకుండా వివిధ ప్రాంతాల పిల్లల మధ్య చెలిమిని పెంచి అందరూ సరదాగా ఉండేలా ప్రోత్సహిస్తారు. ఈ పిల్లల ఆటల పండుగ గురించి.

- స్లోవేనియాకు చెందిన క్రీడా ఉపాధ్యాయుడు మెటొడ్ క్లెమెన్క్ ఆలోచనే ఈ పిల్లల క్రీడోత్సవం.
- తొలిసారిగా 1968లో యుగొస్లేవియాలోని సెల్జెలో వీటిని నిర్వహించగా, తొమ్మిది యూరప్ నగరాలు పాల్గొన్నాయి.
- ఇప్పటి వరకు 47 వేసవికాల, 6 శీతాకాల పోటీలు జరిగాయి.
- ఇప్పటిదాకా 86 దేశాలకు చెందిన 411 నగరాలు పాల్గొన్నాయి.
- మొత్తం 37 వేల మంది చిన్నారులు ఈ ఆటల పోటీల్లో పాల్గొన్నారు.
- గతేడాది ఆస్ట్రేలియాలోని లేక్ మ్యాక్వైర్‌లో నిర్వహించారు.
- ఈ పోటీల్లో మన దేశం నుంచి ఢిల్లీ చిన్నారులు పాల్గొన్నారు.
- వచ్చే ఏడాది తైవాన్‌లోని తైపీ ఈ క్రీడోత్సవానికి వేదిక కానుంది.
- ఈ ఏడాది అల్‌క్మార్‌లో జరిగే పోటీల్లో సుమారు 1500 మంది బాల ఆటగాళ్లు పాల్గొనబోతున్నారు.
- 80 నగరాల నుంచి వచ్చే పిల్లల్లో మన దేశం నుంచి బెంగళూరు బాలలున్నారు.
- జాక్ అండ్ ఫీల్డ్, గోల్ఫ్, ఫుట్‌బాల్, టెన్నిస్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, జూడో, వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారు.
- 1000 మంది వలంటీర్లు, 98 మంది వైద్యులు, 40 మంది ఫిజియోలు పనిచేయనున్నారు.
- పిల్లల కోసం తయారు చేసే ప్రత్యేక విందుల్లో 20 వేల పండ్లు, 450 కేజీల చీజ్, 54 వేల నాలుగు వందల సాండ్‌విచ్‌లు ఉంటాయట.
- వారాంతాల్లో నిర్వహించే ఇక్కడి చీజ్ మార్కెట్‌ను చూసేందుకు పర్యాటకులు తరలివస్తారు.
- ఈ ప్రాంతం చీజ్‌కు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది.
- 1573లో ఎలా ఇక్కడ చీజ్ ఉత్పత్తి ఉండేదో, అప్పటి ప్రజలు వేషధారణ ఎలా ఉండేదో అలా 'కాయిస్కోప్పెన్‌స్టాడ్' అనే గ్రామాన్ని రూపొందించి ప్రదర్శించనున్నారు.
- సరదాగా ఉండేలా టెంట్లలో క్యాంపులను ఏర్పాటు చేశారు. అక్కడే నిద్రపోయేందుకు అన్ని వసతులు కల్పించారు.
- అల్‌క్మార్‌లో చాలా క్రమశిక్షణతో ఉంటారు. రాత్రి 11 గంటల కల్లా అంతా నిశ్శబ్దం అయిపోతుంది. క్రీడా ప్రాంతంలోను అప్పటి కల్లా లైట్లను కట్టేస్తారు.

సంచలన 'సంస్కారం'



సంస్కారం (నవల), యు.ఆర్.అనంతమూర్తి, తెలుగు: సుజాత పట్వారి, ధర: 80/-, పేజీలు: 136, ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, 27-1-54, ఏలూరు రోడ్, గవర్నర్ పేట, విజయాడ-2, ఫోన్: 0866-577533. మరియు ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

తాము నమ్మిన సంప్రదాయమే సంస్కారం అనుకునేవారికి నిజమైన మానవీయ స్పర్శ ఎలా వుంటుందో చూపించడం అంత సులభం కాదు. చలనం లేని వాళ్లను కదిలించాలంటే సంచలనం తీసుకురావలసి వుంటుంది. ఓ నాలుగు దశాబ్దాల కిందట భారత దేశానికి ప్రత్యేకించి దక్షిణ భారత దేశానికి ఆ విధమైన అనుభవం ఇచ్చిన కన్నడ నవల 'సంస్కార'. సాహిత్య కారులు పాఠకులు ఎవరైనా సరే ఇతర భాషల దేశాల పుస్తకాలుకూడా చూడకుండా అవగాహనా పరిధి పెంచుకోలేరు.కనీసం ప్రసిద్ధ రచనలు ప్రసిద్ధుల రచనలైనా చూడకపోతే అదొక లోటుగానే వుండిపోతుంది. అందుకే 'సంస్కార' తెలుగు అనువాదం ఇప్పుడు ప్రజాశక్తి ప్రచురణగా రావడం స్వాగతించదగింది. తెలుగులో సమస్యాత్మక నవలలే తక్కువగా వస్తున్న తరుణం. ఒకప్పుడు పెద్ద ఉద్యమంగా నడిచిన ఉత్తమ గ్రంథానువాద ప్రక్రియ దాదాపు ఆగిపోయింది. కనుకనే సనాతనుల నుంచి నిశిత విమర్శలనూ పురోగాముల ప్రశంసలనూ అందుకొన్న సంస్కార తెలుగులో మలి ముద్రణగా రావడం ఒక ప్రత్యేకతగా చెప్పుకోవలసి వుంటుంది. 1960 లలో కర్ణాటక బ్రాహ్మణ సమాజంలోని విలువలనూ విడ్డూరాలనూ విశ్వాసాలను వాటికి ఎదురైన సవాళ్లనూ సంఘర్షణలనూ ఈ నవలలో యు.ఆర్.అనంతమూర్తి అత్యద్భుతంగా చిత్రించారు. మరీ ముఖ్యంగా అతి చాందసులుగా కనిపించే వారి ద్వంద్వత్వాన్నీ వాటికి బలవుతున్న అసహాయుల ఆర్తనాదాలనూ వీటిపై తిరగబడే వారి సాహసాలనూ సామాజిక వాస్తవికతనూ కూడా ఆయన కళ్లకు కట్టాడు. పఠాభి స్నేహలత జంట దీన్ని చలన చిత్రంగా రూపొందించడం, 1970లలో నవ్య చిత్రాలకు అదో సంకేతం కావడం తెలిసిన విషయాలే. సుజాతా పట్వారి మాతృభాషే కన్నడం గనక ఎక్కడా అనువాదంలా అనిపించదు. భాష పరంగా రెండింటి మధ్య సారూప్యాన్నీ, స్వల్ప సమస్యలనూ కూడా ఆమె ముందుమాటలోనే వివరించారు. ఈ అనువాద క్రమంలో తనకు కలిగిన అనుభవాలను కూడా ఆమె పాఠకులతో పంచుకున్నారు. మూల రచయితను గౌరవిస్తూనే తాను ఏకీభవించలేని భాగాలను కూడా పేర్కొన్నారు. తెలుగు అనువాదానికి తెలకపల్లి రవి ముందుమాటలో నవల పూర్వాపరాలను ప్రస్తావించడమే గాక అనువాదకురాలి అభిప్రాయాలను కూడా విశ్లేషించారు. మొత్తంపైన సంస్కార కథాగమనం పాఠకులను కట్టిపడేస్తుంది. పరిమాణంలో చిన్నదైనా ప్రమాణాల రీత్యా ఉన్నత స్థాయినందుకోవడం ఈ నవల విశేషం.

- పీపీ

యాభయ్యేళ్ల అనుభవాలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్వర్ణోత్సవాల సందర్భంగా 1964-2014 మధ్య గడిచిన కాలంలో రాజకీయంగా అనేక అనుభవాలు కలిగాయి. విజయాలు లభించాయి. ఆదే సమయంలో తీవ్రమైన సవాళ్ల సమస్యలూ వున్నాయి. గత చరిత్రనూ వర్తమానాన్ని అవలోకనం చేసుకోవడానికి వీలుగా మూడు ముఖ్యమైన వ్యాసాలు కలిపి ప్రచురించినదే ఈ చిరు పొత్తం. సైద్ధాంతిక రాజకీయ రంగాలలో ఈ యాభై ఏళ్ల అనుభవాలనూ, దేశంలోనూ రాష్ట్రంలోనూ సిపిఎం నిర్వహించిన పాత్రనూ ఈ వ్యాసాలు తెలియచెబుతాయి.

50 ఏళ్ల సిపిఐ(ఎం) ఆశయాల బాటలో అర్ధశతాబ్దం, పేజీలు:39/-, వెల:25/-, ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, 27-1-54, కారల్ మార్క్స్ రోడ్, గవర్నర్ పేట, విజయవాడ.



చక్కటి కథా గుచ్ఛం

దాదాపు 14 కథానికలున్న ఈ సంపుటి లోని కథలన్నీ పలు పత్రికల్లో బహుమతులు పొందినవే! నేల, ప్రతిధ్వని, మహావృక్షం రేపటి తండ్రి, నిచ్చెన, మెట్లు, దేవుడుండే చోటు, ఎర్ర అట్ట పుస్తకం , స్త్రీకారం, నిన్ను నన్నుగా, మృత్యుర్మా అమృతంగమయ, రెడ్ కార్పెట్ ... కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. యాత్రలు మానవునిలో సంస్కారాన్ని, పది మంది శ్రేయస్సుకి ఉపకరించాలనే ఆలోచనల పరిమళాలు వెదజల్లుతూ యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్ యాత్రల విశిష్టత చెప్పే కథే యాత్ర. 'భూ'దందాలు తెలిపే కథ నేల. ఎమ్.ఐ.జి ఇళ్లు కొని ప్లాట్స్ కట్టించే బిల్డర్ రత్నాకరరావుకి శర్మ ఎదురు తిరిగి తన స్థలం ఇవ్వనంటాడు. వాళ్లను చంపి ఆస్థలం కాజేయాలనుకొనే రత్నాకర్ రావు ఓ రాత్రి హఠాత్తుగా గుండె పోటుతో మరణిస్తాడు. 'ఆ భారీ కాయుణ్ని అంతస్థు భవనం మీద నుండి కిందకు దించి నేల మీద ఉంచుతారు. నేల తల్లి ఆప్యాయంగా హత్తుకుంది' అన్న వాక్యంలో కథ ముగుస్తుంది. మన పెద్దలు అదే అంటారు అరు అడుగుల నేల అని. పోరంకి దక్షిణ మూర్తి గారు చెప్పిన అలనాటి సన్మాన సభ విశేషాలు.....శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు చెప్పిన గొప్ప సన్మానాల్ని ఎరుక పరిచే కథాంశమే "మహావృక్షం" కథ. ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తించే ప్రొఫెసర్‌ను ఆ భార్య సత్యాగ్రహం ద్వారా తన ఇంటి నుండే సంస్కరణని తెచ్చే కథే "స్త్రీ కారం" టైటిల్‌కథ. నేటి ప్రపంచీకరణ నేపథ్యాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు భూ సేకరణ విదేశీ పెట్టుబడులను సంస్థ లను ఆహ్వానించే రాజకీయ తీరు తెన్నుల్ని తేట తెల్లం చేసే కథ రెడ్ కార్పెట్. సామాజి కాంశాలతో శిల్పంతో కూడిన చక్కటి కథా గుచ్ఛం ఈ సంపుటి.

-తంగిరాల చక్రవర్తి

'స్త్రీకారం' కథానికలు, రచయిత: సింహప్రసాద్, వెల : 140/-, పేజీలు: 166, ప్రతులకు: 401- మయూరి ఎస్టేట్స్- య.ఐ.జి 11/650, కె.పి.హెచ్.బి కాలనీ, హైదరాబాద్.

కొత్త జడ

ప్రతి రోజూ కొత్తగా వుండాలి. నిన్నటిది ఇవాళ కనిపించకూడదు. ఇవాళ్టిది అగుపించకూడదు. ఇదే నేటి యూత్ ట్రెండ్. అది జడైనా, డ్రెస్సైనా! రోజూ ఒకేలా మూడు పాయలు తీసుకుని జడ అల్లుకుంటే ఏం మజా వుంటుంది? రెండు పాయలతో, అనేక పాయలతో రకరకాల జడలు...లూజు లూజు జడలు... బిగుతైన జడలు వేసుకుంటే ఆ లుక్కే వేరు. అలా వేయమని అమ్మలను పోరుతుంటారు. 'ఏమోనమ్మా! మా రోజుల్లో ఇవన్నీ లేవు' అంటే ఊరుకుంటున్నారా? అంతర్జాలంలోకి వెళ్లిపోయి సోధించి చూపించి సాధించుకుంటున్నారు. తోటి వారు అవాక్కై చూస్తుంటే వచ్చే కిక్కే వేరు. రోజుకో రకపు జడ కోరుకునే వారికోసం ఇవన్నీ...! ఇలాంటివే ఇంటర్నెట్లో మరెన్నో! ●




Dr. KKR's GOWTHAM
SCHOOLS - ANDHRA PRADESH, TELANGANA
Cell: 9160444661, 9160444646
email: kkr_gis@yahoo.co.in
website: kkrgowtham.com
స్కూలు స్థాపించిన 8 వ బ్యాచ్‌తో
1535
IIT
ర్యాంకులు
సాధించాము
ఓపెన్ కేటగిరీలో
2015 IIT అడ్వాన్స్‌డ్ లో ఫలితాలు
సాధించిన (2013 బ్యాచ్) మా పూర్వవిద్యార్థులు
All India Rank
9
K VISHNU VARDHAN REDDY
HT.NO:6037138
All India Rank
9
(OBC)
DABBADA CHANUKYA
HT.NO:6042284
వివిధ కేటగిరీలో
IIT లో 100
లోపు ర్యాంకులు
All India Rank 9 K VISHNU VARDHAN REDDY HT.NO.6037138
All India Rank 9 DABBADA CHANUKYA HT.NO.6042284
All India Rank 16 KOSURU JOSHI HT.NO.6044067
All India Rank 22 R HEMA CHANDRA HT.NO.6010272
All India Rank 24 BOORA AASISH HT.NO.6041002
All India Rank 27 VOORA NAGA SREE THEJA HT.NO.6037139
All India Rank 54 PAGOLU OHM PRAKASH HT.NO.6042096
All India Rank 59 BALLA REVANTH BABU HT.NO.6044244
All India Rank 63 S LAKSHMI SAI KRISHNA HT.NO.6044282
All India Rank 66 PALLA SAI BHARATH HT.NO.6043046
వీరు మా గౌతమ్ స్కూలులో 10th క్లాసు వరకు చదివి ఐ.ఐ.టి ఫౌండేషన్ తీసుకున్న మా పూర్వ విద్యార్థులు. ఇంటర్‌తోపాటు వివిధ
పోటీపరీక్షల్లో వారు సాధించిన ఈ అద్భుతమైన ర్యాంకుల ద్వారా స్కూలులో మేమిచ్చిన ఐ.ఐ.టి పౌండేషన్ ప్రభావం నిరూపించబడింది.